విలేకరులు కావలెను
తెలంగాణ వాణి
తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు, నియోజకవర్గాలు, మండలాల వారిగా విలేకర్లు కావలెను.
పొలిటికల్, ప్రజాసమస్యలు, అక్రమాలపై వార్త రాసే పట్టు కలిగిన వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వబడును
9703247143

TELANGANA VANI TELUGU DAILY
R N I No. APTEL/2012/53127

# తెలంగాణ వాణి

తెలుగు దినపత్రిక
తెలంగాణ వాణి TV
THE VOICE OF TELANGANA
ఎడిటర్ జేరిపోతుల సంపత్
9912758107

సంపుటి: 16 | సంచిక : 108 | శనివారం 15. 8. 2026 | ఎడిటర్: జేరిపోతుల సంపత్ | కరీంనగర్ | పేజీలు 8 | వెల: 5.00

## రాజగోపాల్‌రెడ్డి అలా మాట్లాడటం సరికాదు

- కాంగ్రెస్ పార్టీలో సీఎం సహా ఎవరికైనా ఒకటే గౌరవం ఉంటుంది
- టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్
- మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డికి కూడా అదే గౌరవం ఇస్తున్నాం
- 'కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఆవేదన, ఆందోళనను అర్థం చేసుకుంటాం.
- పార్టీకి సంబంధించి నాలుగు గోడల మధ్య చర్చించాల్సిన అంశాలను బహిరంగంగా మాట్లాడకూడదు.
- రాజగోపాల్‌రెడ్డి ప్రజా నాయకుడు.. నాకు మంచి మిత్రుడు.
- సమయం వచ్చినప్పుడు అవకాశాలు ఉంటాయి

## దేశంలోనే తెలంగాణ సైబర్ పోలీస్ బెస్ట్

- తెలంగాణ సైబర్‌క్రైమ్ బ్యూరో ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ప్రత్యేక సైబర్ అవగాహన
- తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్
- జాతీయ స్థాయి ర్యాంకింగ్స్‌లో తెలంగాణ సైబర్‌క్రైమ్ కు దేశంలోనే ప్రథమ స్థానం
- సమాజంలో మాదకద్రవ్యాలు, కల్తీ ఆహారం, వ్యవస్థీకృత నేరాలతో పాటు సైబర్ నేరాలు
- మొత్తం సైబర్ నేరాల్లో దాదాపు 60 శాతం పెట్టుబడి మోసాలే ..




## విభజన గాయాలు దేశ ప్రజల గుండెల్లో నిలిచే ఉన్నాయి

దేశ విభజన నాటి భయానక క్షణాలు, జరిగిన ప్రాణనష్టం దేశ ప్రజల గుండెల్లో ఎప్పటికీ మాయని గాయాలుగా మిగిలిపోయాయని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ పేర్కొన్నారు. హర్యానాలోని గురుగ్రామ్‌లో నిర్వహించిన 'విభజన భయానక స్మృతి దినోత్సవం' కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. 1940 లాహోర్ తీర్మానం సమయంలోనే దేశ స్వాతంత్ర్యానికి మూల్యంగా విభజన తప్పదనే సంకేతాలు వచ్చాయని ఆయన గుర్తుచేశారు. అధికారాన్ని చేజిక్కించుకోవడానికి కొందరు కలలు కన్నారని, అధికారం కోసం వారు చేసిన తొందరపాటు నిర్ణయాలు కోట్ల మంది భారతీయుల భవిష్యత్తును బలితీసుకున్నాయని, స్వాతంత్ర్యం కోసం పోరాడిన ప్రజలు రక్తంతో హోలీ ఆడుతూ ఆప్తులను కోల్పోవాల్సి వచ్చిందని ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.



## ఎన్నో జీవితాలను చిన్నాభిన్నం చేసిన దేశ విభజన..

- దేశ ప్రధాని నరేంద్రమోదీ
- ప్రతి ఏటా స్వాతంత్ర్య దినోత్సవానికి ముందు రోజున భారత ప్రభుత్వం 'పార్టిషన్ హారర్స్ రిమెంబరెన్స్ డే'
- నాడు విభజన గాయాల బాధితులు ప్రియమైన వారిని కోల్పోయారు అంతులేని బాధను అనుభవించారు.
- అంతటి భయానక పరిస్థితుల నుంచి ప్రజలు తమ జీవితాలను పునర్నిర్మించుకున్నారు.
- ప్రతికూలతలను విజయంగా మార్చుకున్నారు.
- దేశ ప్రగతికి దోహదపడ్డారు. సామరస్యం, సౌభ్రాతృత్వాన్ని పరిరక్షించడానికి, వికసిత్ భారత్ నిర్మాణానికి సమష్టిగా కృషిచేసేలా వారి జీవితాలు మనందరికి స్ఫూర్తినిస్తాయి"



# ఏడాది ముందే విద్యార్థుల ఖాతాల్లోకి నగదు

## తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

- హెచ్ఎండీఏ గ్రౌండ్స్ లో పూలే దంపతుల విగ్రహావిష్కరణలో సీఎం
- రాష్ట్రంలోని పేద విద్యార్థుల చదువుకు ఫీజుల భారం అడ్డుకాకూడదు
- ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం అమలులో ప్రభుత్వం విప్లవాత్మక మార్పులు
- ఈ ఏడాదికి సంబంధించిన ఫీజు రీయింబర్స్ మెంట్ కోసం ఇప్పటికే రూ.250 కోట్లు బ్యాంకు ఖాతాల్లో జమ
- భవిష్యత్‌లో కళాశాలల్లో ప్రవేశాలు పొందాక ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న నెలలోపు ఫీజు రీయింబర్స్ మెంట్
- ఈ దేశంలో పశువులకు లెక్క ఉంది కానీ బీసీల లెక్కలు లేవని అందుకే ఎన్ని అడ్డంకులు
- ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న ఎస్సీ కులగణన చేపట్టాం
- కుటుంబ సమగ్ర సర్వేలో పాల్గొనని వారు బీసీ లెక్కలను అడ్డుకునేందుకు అనేక ప్రయత్నాలు
- గత ప్రభుత్వంలో గొర్రెలు, బర్రెలు పెంచుకోవాలని చెబితే మేము డాక్టర్లు, లాయర్లు ఐఏఎస్, ఐపీఎస్ లు, ప్రజాప్రతినిధులు కావాలని చూస్తున్నాం

**హైదరాబాద్:(తెలంగాణ వాణి)**

రాష్ట్రంలోని పేద విద్యార్థుల చదువుకు ఫీజుల భారం అడ్డుకాకూడదనే లక్ష్యంతో ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం అమలులో ప్రభుత్వం విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. వచ్చే విద్యాసంవత్సరం నుంచి అడ్వాన్స్ గా విద్యార్థుల ఖాతాలో ఫీజు రీయింబర్స్ మెంట్ డబ్బులు జమ చేయబోతున్నామని చెప్పారు. ఈ ఏడాదికి సంబంధించిన ఫీజు రీయింబర్స్ మెంట్ కోసం ఇప్పటికే రూ. 250 కోట్లు బ్యాంకు ఖాతాల్లో జమచేశామని భవిష్యత్‌లో కళాశాలల్లో ప్రవేశాలు పొందాక ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న నెలలోపు ఫీజు రీయింబర్స్ మెంట్ డబ్బులు విద్యార్థుల ఖాతాలో జమ చేస్తామన్నారు.





## మోడీ పిలుపుతో దేశమంతా హర్ ఘర్ తిరంగా

### కేంద్రమంత్రి బండి సంజయ్

**హైదరాబాద్:(తెలంగాణ వాణి)**

ప్రధాని నరేంద్రమోడీ పిలుపుతో దేశమంతా హర్ ఘర్ తిరంగా యాత్ర నిర్వహిస్తున్నట్లు కేంద్ర సహాయమంత్రి బండి సంజయ్ పేర్కొన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం ట్యాంక్ బండ్ అంబేద్కర్ విగ్రహం నుంచి వివేకానంద విగ్రహం వరకూ నిర్వహించిన ర్యాలీలో బండి సంజయ్ పాల్గొన్నారు. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, సైనా నెహ్వాల్, దీపికా రెడ్డి, నటీనటులు సాయికుమార్, సంతోష్, ఫరియా అబ్దుల్లా తదితరులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ.. నేటి యువతకు స్వాతంత్ర్యం కోసం పోరాడిన సమరయోధుల గురించి చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. మేకిన్ ఇండియా, స్టార్టప్ ఇండియా ద్వారా యువతకు ఎన్డీఏ సర్కార్ మంచి అవకాశాలను కల్పిస్తోందన్నారు.

## సీఎం కుటుంబంపై లోకాయుక్తలో బీఆర్ఎస్ ఫిర్యాదు




**హైదరాబాద్:(తెలంగాణ వాణి)**

తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి కుటుంబంపై బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు లోకాయుక్తలో ఫిర్యాదు చేశారు. రేవంత్ కుటుంబం భూ అక్రమాలకు పాల్పడుతోందని పేర్కొన్నారు. టెస్సరాక్ట్ కంపెనీకి రూ. 200 కోట్ల విలువైన భూములను కేటాయించారని ఆరోపించారు. టెస్సరాక్ట్ కంపెనీ సీఎం తమ్ముడు కొండల్‌రెడ్డికి చెందినదని ఫిర్యాదులో పేర్కొన్నారు. "రావిర్యాలలో ఐదెకరాల భూమిని రూ. 7కోట్లకు ధారాదత్తం చేశారు. టెస్సరాక్ట్ కంపెనీ మూలధనం రూ. లక్ష మాత్రమే. కొండల్‌రెడ్డి ఛైర్మన్‌గా.. నయన్‌రెడ్డి సీఈవోగా ఉన్నారు. ఆ భూ కేటాయింపులు రద్దు చేయాలి. దీనిలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు, టీజీఐఐసీ అధికారుల పాత్రపై విచారణ జరిపించాలి" అని ఫిర్యాదులో బీఆర్ఎస్ నేతలు కోరారు.

## యాదగిరిగుట్టలో 2వేల మందికి నిత్యాన్నదానం

- కొండపై దీక్షాపరుల, నిత్యకల్యాణ మండపాల ఏర్పాటు, మెట్ల మార్గంలో షెడ్లు, వేద పాఠశాల, గోశాల, రాయగిరి వద్ద భారీ కమాన్ నిర్మాణాలు
- ఆర్జిత సేవలు, నిత్య కైంకర్యాలకు టీసీఎస్ ఆధ్వర్యంలో ఆన్‌లైన్ సౌకర్యం కల్పించేందుకు పాలకమండలి ఆమోదం
- భక్తుల కోసం ప్రత్యేక సబ్ కమిటీల ఏర్పాటుకు నిర్ణయం తీసుకుంది.
- కొండ చుట్టూ ప్రధాన కూడళ్ల వద్ద రాతి విగ్రహాల ఏర్పాటు, తులసి కాటేజీలో రెండు కల్యాణ కట్టల నిర్మాణానికి ట్రస్ట్ బోర్డు ఆమోదం
- దాతల కోసం కొండపై ప్రత్యేక కార్యాలయం, గిరిప్రదక్షిణ మార్గంలో సోలార్ వ్యవస్థ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది..



## వ్యక్తిగత దూషణలొద్దు.. వారి ట్రాప్‌లో పడొద్దు

- జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్
- అనవసర విషయాలపై ఇష్టానుసారం భాషను ఉపయోగించడం మంచిది కాదు
- ప్రసార మాధ్యమాలు, సోషల్‌మీడియాలో మాట్లాడే సమయంలో పార్టీ నేతలుకు నిర్దేశం
- 'వ్యక్తిగత విషయాలు, వ్యక్తిగత దూషణల జోలికి వెళ్లొద్దు.
- పార్టీల సిద్ధాంతాలు, మార్గదర్శకాలకనుగుణంగానే స్పందించాలి.
- ఏదైనా విషయంపై మాట్లాడే సమయంలో ఆవేశాలకు గురికావొద్దు.
- అసభ్య పదజాలాన్ని వాడొద్దు. మహిళలను గౌరవించి మాట్లాడండి.
- పట్ల సోషల్ మీడియా వేదికగా ఇష్టానుసారం మాట్లాడొద్దు.
- పార్టీ భావజాలాన్ని కించపరిచేలా మాట్లాడే వారిని ఉపేక్షించం.
- పార్టీ క్రమశిక్షణకు విఘాతం కలిగించేలా, జనసైనికుల్ని రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేసే వారి పట్ల జాగ్రత్తగా ఉండండి.
- వారి ప్రభావానికి లోనవ్వొద్దు. కూటమి ప్రభుత్వ స్ఫూర్తిని నిలబెట్టేలా మాట్లాడాలి





## ఖమ్మం జిల్లాను ప్రముఖ పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దాలి

- నీటి వనరులను పరిరక్షిస్తూ పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేయాలి
- జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్

**ఖమ్మం, బోనకల్, ఆగస్టు 14 (తెలంగాణ వాణి)**

ఖమ్మం జిల్లాలోని సహజసిద్ధమైన నీటి వనరులు, చెరువులు, సరస్సులను పర్యావరణ పరిరక్షణకు అనుగుణంగా పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేసి జిల్లాను ప్రముఖ పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం బోనకల్, మధిర మండలాల్లో పర్యటించిన కలెక్టర్ కలకోట పెద్దచెరువు, మడుపల్లి, మధిర ట్యాంక్‌బండ్ ప్రాంతాల్లో కొనసాగుతున్న పర్యాటక అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, నాణ్యతలో ఎలాంటి లోపాలను సహించబోమని స్పష్టం చేశారు. మధిర ట్యాంక్‌బండ్ వద్ద కాటేజీలు, రిసెప్షన్, కిచెన్, రెస్టారెంట్, టాయిలెట్ బ్లాక్ తదితర మౌలిక సదుపాయాల పనులను వేగవంతం చేయాలని సూచించారు. అలాగే కలకోట పెద్దచెరువు వద్ద కాటేజీలు, కేఫెటీరియా, పార్కింగ్, విద్యుత్, టాయిలెట్ బ్లాక్ తదితర సదుపాయాలతో సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. పర్యాటక అభివృద్ధి పేరుతో నీటి వనరులు, పర్యావరణానికి నష్టం కలగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. పర్యాటక ప్రాంతాల అభివృద్ధి ద్వారా స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు స్థానిక ఆర్థిక వ్యవస్థకు ఊతమివ్వాలని అన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రతిపాదనలను త్వరితగతిన ఖరారు చేసి అమలు దశకు తీసుకురావాలని ఆదేశించారు.

## డిసెంబర్‌లో గ్లోబల్ సమ్మిట్ 2.0..

- స్మార్ట్ ఆటోలకు లక్షా 50 వేల సబ్సిడీ..
- నేడు రాష్ట్రంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ
- మహానగరంలో కాలుష్యాన్ని అరికట్టి 'గ్రీన్ సిటీ'గా మార్చేందుకు నిర్ణయం
- 7 రకాల సన్నాలకు రూ.500 బోనస్!
- రాష్ట్రంలోని ఐటీఐలు, ఏటీసీలు, పాలిటెక్నిక్ కాలేజీలను యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ పరిధిలోకి..
- తెలంగాణ ఎడ్యుకేషన్ యాక్ట్ నుంచి తొలగించి యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ పరిధిలో..
- కొడంగల్ ఎత్తిపోతలకు రూ. 2,100 కోట్లు:
- హైదరాబాద్ నగరంలోని కాలుష్య కారక పరిశ్రమలను శివార్లకు తరలించే హెచ్ఐఎల్‌టీ పాలసీ
- పలు తిర్మానాలకు రాష్ట్ర కాబినేట్ ఆమోదం



## తెలంగాణలో 'స్మార్ట్ రేషన్ కార్డులు' పంపిణీ

**హైదరాబాద్:(తెలంగాణ వాణి)**

రాష్ట్ర ప్రభుత్వం లబ్ధిదారులకు డిజిటల్ సేవలను మరింత వేగవంతంగా అందించేందుకు కీలక నిర్ణయం తీసుకుంది. ఈ నెల 15 నుంచి రాబోయే 15 రోజుల పాటు కొత్త 'స్మార్ట్ రేషన్ కార్డుల'ను పంపిణీ చేయనుంది. ఈ నేపథ్యంలో కొత్త స్మార్ట్ రేషన్ కార్డు మోడల్‌ను ప్రభుత్వం అధికారికంగా విడుదల చేసింది. అత్యంత ఆధునికమైన డిజైన్‌తో రూపొందించిన ఈ స్మార్ట్ రేషన్ కార్డులో భద్రత, స్పష్టతకు అత్యధిక ప్రాధాన్యతను ఇచ్చారు. కార్డు ముందు భాగంలో సీఎం రేవంత్ రెడ్డి, పౌరస రఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఫొటోలు ఉన్నాయి. వాటితో పాటు రేషన్ కార్డు నంబర్, కుటుంబ యజమాని పేరు, సంబంధిత రేషన్ షాపు నంబర్ వంటి కీలక వివరాలు ముద్రించి ఉన్నాయి.

# “”గర్వపడ్డ గోమాత””

తాగునీరు లేని గూడెంలో తన మూత్రం తక్కువ ధరతో తగ్గించిన ప్రాణాంతకమైన రోగాలకి
పెద్దకూర తగాదాలో తనువు చాలించిన హిందూ ముస్లిము తమ్ముళ్ళ తలదన్నే త్యాగాలకి
ఈనాటికీ తలుపేలేని కూలిపోయే కోట్ల కొత్త పాకల్లో తాను తొలి అడుగేసిన ముహూర్తానికి
ముస్తాబైన గోశాలల్లో తమకో గది అడిగిన బిడ్డలొదిలిన వృద్ధ దంపతుల గంగ మునిగిన గౌరవానికి
సంధ్యా సమయంలో షికారుకెళ్తే సడలిన కాలుతో సాష్టాంగ నమస్కారంచేసిన సొట్టబడ్డ సంత రోడ్డు గుంతలకి
తన పవిత్రమయిన పేడ పేరున పోలైన పనికిరాని పోటుగాళ్ళ పురివిప్పిన ఓట్లకి
ఎనభై వసంతాల పునరావిర్భవ భరత భూమి బుద్ధిలేని బాధ్యతకి
బిన్నత్వంలో ఏకత్వం చిన్నాభిన్నమయ్యే
ఒకే మత ఎజెండాతో ఎర్రకోటపై ఎగరబోయే
మూడు రంగుల జెండాని చూసి గోమాత గర్వపడింది.



నేపా సంతోష్ అచ్యుత్ కుమార్
అసిస్టెంట్ ప్రొఫెసర్,
కాళోజీ ప్రతిభా పురస్కార గ్రహీత.
8639442397.

## నంగారా భేరి లంబాడి హక్కుల పోరాట సమితి మండల కమిటీ నియామకం



**టేకులపల్లి, ఆగస్టు 14 (తెలంగాణ వాణి):**
నంగారా భేరి లంబాడి హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో టేకులపల్లి మండల నూతన అధ్యక్ష, ఉపాధ్యక్షులను శుక్రవారం నియమించారు. కార్యక్రమానికి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, న్యాయవాది బానోత్ రమేష్ నాయక్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు భూక్యా మంగీలాల్ నాయక్ ముఖ్య అతిథులుగా హాజరై నూతన కమిటీని ప్రకటించారు. టేకులపల్లి మండల అధ్యక్షుడిగా బానోత్ జబ్బర్ లాల్ నాయక్, ఉపాధ్యక్షుడిగా మూడు మురళీమోహన్ నాయక్లను నియమించి నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా రమేష్ నాయక్ మాట్లాడుతూ లంబాడీల రాజ్యాంగబద్ధ హక్కుల సాధన, సమస్యల పరిష్కారం కోసం ప్రతి గ్రామం, తండాలో సంఘాన్ని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. నూతన నాయకులు మండలంలో సమితిని విస్తరించి గిరిజనుల సంక్షేమం కోసం కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా, మండల నాయకులు, తండాల పెద్దలు, గిరిజన యువకులు పాల్గొన్నారు.

## తక్కువ నీటి అవసరమయ్యే ఆరుతడి పంటలే మేలు



**టేకులపల్లి, ఆగస్టు 14 (తెలంగాణ వాణి):**
ప్రస్తుత వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో రైతులు తక్కువ నీటి అవసరమయ్యే ఆరుతడి పంటలను సాగు చేయడం మేలని ఇల్లందు వ్యవసాయ శాఖ ఏడీఏ లాల్‌చంద్ సూచించారు. టేకులపల్లి మండలం లచ్చగూడెంలో శుక్రవారం నిర్వహించిన రైతుల అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. వర్షపాతం అనిశ్చితంగా ఉండే అవకాశం ఉన్నందున నీటి లభ్యతను ముందుగానే అంచనా వేసుకుని పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. పెసర, మినుము, నువ్వులు, జొన్న, కుసుమ వంటి ఆరుతడి పంటలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. లచ్చగూడెం గడ్డి చెరువు ఆయకట్టు పరిధిలోని సుమారు 1,000 ఎకరాలతో పాటు బోడు, కొప్పురాయి గ్రామాల్లో పారికలవాగు కింద ఉన్న సుమారు 250 ఎకరాల్లో ఆరుతడి పంటలు సాగు చేయాలని సూచించారు. నీటి కొరత కారణంగా రైతులు నష్టపోకుండా ముందస్తు ప్రణాళికతో పంటల ఎంపిక చేసుకోవాలని ఏడీఏ లాల్‌చంద్ కోరారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ బోడా మంగీలాల్ నాయక్, లచ్చగూడెం సర్పంచ్ వెంకటేశ్వర్లు, ఏవో అన్నపూర్ణ, ఏ ఈ ఓ రెహానా, రైతులు పాల్గొన్నారు.

## మేరా యువ భారత్ ఆధ్వర్యంలో స్వచ్ఛతా పఖ్వాడా




**ఖమ్మం, ఆగస్టు 14 (తెలంగాణ వాణి)**
మేరా యువ భారత్ ఆధ్వర్యంలో స్వచ్ఛతా పఖ్వాడా కార్యక్రమాన్ని బిసి ట్రైబల్ వెల్ఫేర్ డిగ్రీ కళాశాల నందు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా గాజుల కృష్ణారావు రఘునాథపాలెం సర్పంచ్, నాగేశ్వరరావు కళాశాల ప్రిన్సిపాల్, పువ్వాడ నగర్ జాగృతి యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు సయ్యద్ షారుఖ్ ఇమ్రాన్, యన్.వై.వి మహమ్మద్ సమ్మయ్య పాల్గొన్నారు. గాజుల కృష్ణారావు మాట్లాడుతూ భారత ప్రభుత్వ స్వచ్ఛ భారత్ మిషన్ కింద పరిశుభ్రతపై అవగాహన కల్పించడానికి నిర్వహించే పక్షోత్సవమే స్వచ్ఛతా పఖ్వాడా, ప్రధాన ఉద్దేశాలు : సమాజంలో పరిశుభ్రతపై స్పృహ పెంచడం, ప్రజలను భాగస్వామ్యం చేయడం, వ్యర్థాల నిర్వహణ మరియు పర్యావరణ పరిరక్షణ అని విద్యార్థులకు వివరించడం జరిగింది, విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించగా అందులో గెలుపొందిన విద్యార్థులకు మొదటి, ద్వితీయ బహుమతులు మరియు సర్టిఫికెట్లు అందజేయడం జరిగింది. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించి, ర్యాలీ తీయించడం జరిగింది. స్వచ్ఛతా పఖ్వాడా లో భాగంగా ఖమ్మం, ఖమ్మం రూరల్, రఘునాథపాలెం మండలలో కళాశాలలు మరియు బహిరంగ ప్రదేశాలలో పరిశుభ్రత పనులు చేయడం జరిగింది.

# జెన్ జెడ్ గొంతుకగా నేహా

క్యాంపస్ గోడల మీద కొత్త ఉదయం రాస్తున్నది ఒక తరం
ప్రశ్నల పిడికిలితో భవిష్యత్తు తలుపు తడుతున్నది ఒక తరం
నేహా గొంతులో వేల గొంతుల నినాదం మోగు తున్న వేళ
ఏఐఎస్ఏ బాటలో జెన్ జెడ్ తన జెండా ఎగరేస్తున్న వేళ

ఒక తరం తన గురించి మాట్లాడటానికి ఒక నాయకుడిని వెతుక్కుం టుందా? లేక తనలోంచే ఒక గొంతును సృష్టించుకుం టుందా? నేటి విద్యార్థి ఉద్యమం ముందుకు తెస్తున్న ప్రశ్నల్లో నేహా ఒక ప్రతీకగా కనిపిస్తోంది. ఆమెను కేవలం ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఏఐఎస్ఏ) జాతీయ అధ్యక్షురాలిగా చూడటమంటే ఆమె ముందుకు తీసుకొస్తున్న రాజకీయ ప్రశ్నను చిన్నదిగా చూడటమే. నేహా చుట్టూ కదులుతున్న చర్చ ఒక వ్యక్తి రాజకీయ ప్రయాణం కంటే పెద్దది. చదువుకుంటున్న యువత తన భవిష్యత్తుపై నిర్ణయం తీసుకునే ప్రక్రియలో తన గొంతును ఎలా వినిపించాలి? విద్య, ఉపాధి, సామాజిక న్యాయం, ప్రజాస్వామ్యం గురించి యువతే ఎలా మాట్లాడాలి? తన జీవితాన్ని ప్రభావితం చేసే విధానాలపై యువతే ఎలా ప్రశ్నించాలి? ఇదే ప్రశ్న “జెన్ జెడ్ రైజింగ్”కు రాజకీయ అర్థాన్ని ఇస్తోంది.

నేహా దేశవ్యాప్త పర్యటనను సభల పరంపరగా మాత్రమే చూస్తే దాని అసలు ఉద్దేశం కనపడదు. ఆమె వెళ్లే ప్రతి క్యాంపస్, కలిసే ప్రతి విద్యార్థి, మాట్లాడే ప్రతి నిరుద్యోగ యువకుడు ఒక కొత్త రాజకీయ సంభాషణకు వేదిక కావాలి. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద వినిపించిన ప్రశ్న ఒక నగరానికే పరిమితం కాకుండా దేశంలోని వివిధ విద్యార్థి కేంద్రాలకు చేరాలి. ఆ ప్రశ్నకు స్థానిక భాషలు, స్థానిక సమస్యలు, స్థానిక అనుభవాలు జత కావాలి. అప్పుడే ఒక దేశవ్యాప్త విద్యార్థి ఉద్యమం రూపుదిద్దుకుంటుంది. ఇక్కడే నేహా నాయకత్వం వహిస్తున్న ఏఐఎస్ఏ పాత్ర కీలకమవుతుంది.

ఏఐఎస్ఏ రాజకీయ ప్రయాణాన్ని అర్థం చేసుకోవాలంటే దాని వైచారిక నేపథ్యాన్ని కూడా చూడాలి. భారత విద్యార్థి ఉద్యమంలో ఏఐఎస్ఏ ఒక సాధారణ క్యాంపస్ సంఘంగా మాత్రమే ఎదగలేదు. సీపీఐ (ఎంఎల్) లిబరేషన్‌తో ముడిపడిన విప్లవ ప్రజాస్వామ్య రాజకీయ సంప్రదాయంలో విద్యార్థి ఉద్యమాన్ని నిర్మించుకుంటూ వచ్చింది. వర్గ దోపిడీకి వ్యతిరేకంగా పోరాటం, కుల వివక్ష నిర్మూలన, సామాజిక న్యాయం, ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ, విద్యను ప్రజా హక్కుగా చూడటం లాంటి ప్రశ్నలను విద్యార్థి జీవితంతో అనుసంధానించడం ఆ రాజకీయ సంప్రదాయంలో కీలకమైన అంశం.

అందుకే ఏఐఎస్ఏకు విద్యార్థి సమస్య అంటే కేవలం క్యాంపస్ సమస్య కాదు. ఫీజులు పెరిగితే దాని వెనుక ఉన్న విధానాన్ని ప్రశ్నించాలి. ప్రభుత్వ విశ్వవిద్యాలయాలకు నిధులు తగ్గితే దాని వెనుక ఉన్న ప్రైవేటీకరణ ధోరణిని ప్రశ్నించాలి. పేద, దళిత, ఆదివాసీ, వెనుకబడిన వర్గాల విద్యార్థులకు అవకాశాలు తగ్గితే దాని వెనుక ఉన్న సామాజిక అసమానతలను ప్రశ్నించాలి. క్యాంపస్‌లో ప్రశ్నించే గొంతులను నియంత్రిస్తే, దాన్ని దేశ ప్రజాస్వామ్యంపై జరుగుతున్న దాడితో అనుసంధానించాలి. ఇదే ఏఐఎస్ఏ రాజకీయ ప్రత్యేకత.

విద్యార్థి ఉద్యమాన్ని విస్తృత ప్రజా ఉద్యమంతో అనుసంధానించాలనే ఆలోచన దాని రాజకీయ దృష్టిలో కీలకం. చదువుకునే విద్యార్థి రేపటి సమాజంలోకి అడుగుపెట్టబోయే పౌరుడు. అతని భవిష్యత్తును ప్రభావితం చేసే విద్యా, ఆర్థిక, ఉపాధి, సామాజిక విధానాలన్నీ రాజకీయ నిర్ణయాలే. కాబట్టి విద్యార్థి తన భవిష్యత్తుపై ప్రశ్నించడం రాజకీయాల్లోకి రావడం మాత్రమే సరిపోదు, ప్రజాస్వామ్యాన్ని సజీవంగా ఉంచే పౌర హక్కును వినియోగించుకోవాలి. నేహా నాయకత్వం ఈ రాజకీయ సంప్రదాయాన్ని కొత్త తరానికి అర్థమయ్యే భాషలో ముందుకు తీసుకెళ్లే ప్రయత్నంగా చూడాలి.

ఈ తరం రాజకీయాలను పాత నిర్వచనాలతో మాత్రమే అర్థం చేసుకోవడం కుదరదు. చేతిలో మొబైల్ ఉంటుంది. ప్రపంచం మొత్తం ఒక స్క్రీన్‌లో కనిపిస్తుంది. ఒక క్యాంపస్‌లో జరిగిన ఘటన నిమిషాల్లో దేశవ్యాప్తంగా చర్చకు వస్తుంది. ఒక విద్యార్థి అనుభవం వేలాది మందికి చేరుతుంది. ఒక హ్యాష్‌ట్యాగ్ ఒక ఉద్యమానికి గుర్తుగా మారుతుంది. డిజిటల్ ప్రపంచంలో వైరల్ కావడం ఉద్యమం కాదు. ఒకరోజు ట్రెండ్ కావడం చరిత్రను మార్చదు. ఆ అసంతృప్తికి సంఘటిత రూపం ఇవ్వాలి. ఆవేశాన్ని ఆలోచనగా మార్చాలి. ఆలోచనను కార్యాచరణగా మార్చాలి. కార్యాచరణను నిరంతర ఉద్యమంగా మలచాలి. అక్కడే విద్యార్థి సంఘం అవసరం.

ఏఐసఏను నేహా కేంద్రంగా చూస్తున్నప్పుడు ఇదే విషయాన్ని గుర్తించాలి. నేహా ఒక ముఖం కావచ్చు. కానీ ఉద్యమం ఒక్క ముఖం కాదు. ఒక నాయకురాలి ప్రసంగం విద్యార్థులను ఆకట్టుకోవచ్చు. ఆ ప్రసంగం తర్వాత క్యాంపస్‌లో ఏర్పడే చర్చ, ఆ చర్చ నుంచి పుట్టే విద్యార్థి బృందం, ఆ బృందం నుంచి మొదలయ్యే పోరాటం, ఆ పోరాటం నుంచి నిర్మితమయ్యే ఐక్యతలు ఉద్యమానికి అసలు బలాన్నిస్తాయి. అందుకే “నేహా” అనే పేరు ఒక వ్యక్తిని మించి ఒక రాజకీయ ప్రశ్నగా మారాలి. యువతను ఎవరు ప్రాతినిధ్యం వహిస్తారు? వారి సమస్యలను ఎవరు రాజకీయ అజెండాలోకి తీసుకువస్తారు? క్యాంపస్‌లోని సాధారణ విద్యార్థి నుంచి పరిశోధకుడి వరకు, కోచింగ్ సెంటర్‌లో ఏళ్ల తరబడి పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగి నుంచి ఫీజుల కోసం అప్పులు చేస్తున్న కుటుంబం వరకూ, వీరి జీవితాల మధ్య ఉన్న సంబంధాన్ని ఎవరు చూపిస్తారు? ఇది కేవలం నాయకత్వ ప్రశ్నగా చూడకూడదు. ఇది ప్రతినిధిత్వ ప్రశ్న.

నేహా ముందుకు వస్తున్న సందర్భంలో ఈ ప్రతినిధిత్వ ప్రశ్న మరింత ప్రాధాన్యం సంతరించుకుంటోంది. నేటి యువతకు రాజకీయాలపై ఒక సందేహం ఉంది. ఎన్నికల సమయంలో తమను గుర్తు చేసుకునే రాజకీయాలు తమ భవిష్యత్తును నిజంగా పట్టించుకుంటున్నాయా? ఉద్యోగాల గురించి వాగ్దానాలు ఎన్నో. కానీ ఖాళీ పోస్టులు ఎప్పుడు భర్తీ అవుతాయి? పరీక్షలు ఎప్పుడు సక్రమంగా జరుగుతాయి? నియామక ప్రక్రియ ఎప్పుడు పూర్తవుతుంది? ప్రభుత్వ విద్యాసంస్థలకు నిధులు ఎప్పుడు పెరుగుతాయి? స్కాలర్‌షిప్‌లు ఎప్పుడు అందుతాయి? ఈ ప్రశ్నలకు సమాధానం కోరడమే యువత రాజకీయ చైతన్యానికి మొదటి మెట్టు. నేహా పర్యటన అందుకే ఒక “మోటివేషనల్ టూర్”గా ఉండకూడదు. యువతను ఉత్సాహపరచడం మాత్రమే సరిపోదు. వాళ్ల సమస్యలను వినాలి. వాళ్ల అనుభవాలను నమోదు చేయాలి. ప్రతి రాష్ట్రంలో విద్యార్థుల ప్రత్యేక సమస్యలను గుర్తించాలి. వాటిని జాతీయ సమస్యలతో అనుసంధానించాలి. స్థానిక ఉద్యమాలను పరస్పరం కలపాలి.

హైదరాబాద్‌లో విద్యార్థి ప్రశ్నకు ఒక రూపం ఉంటుంది. విజయవాడలో మరో రూపం ఉంటుంది. బెంగళూరులో ఉద్యోగ




మార్కెట్ సమస్య మరోలా కనిపిస్తుంది. ఢిల్లీలో కేంద్రీకృత విద్యా విధానంపై ప్రశ్న ముందుకు రావచ్చు. బీహార్‌లో పోటీ పరీక్షలు, నియామకాల ఆలస్యం ప్రధాన సమస్య కావచ్చు. కేరళలో మరో రకమైన విద్యా ప్రశ్న ఉండవచ్చు. ఈ విభిన్న సమస్యల లోపల ఒకే సాధారణ ప్రశ్న ఉంది. యువత భవిష్యత్తును ఎవరు నిర్ణయిస్తున్నారు? “జెన్ జెడ్ రైజింగ్” ఆ సామ్యాన్ని గుర్తించే ప్రయత్నం. తెలంగాణలో నేహా పర్యటనకు అందుకే ప్రత్యేకమైన రాజకీయ ప్రాధాన్యం ఉంది. హైదరాబాద్ కేవలం ఐటీ నగరం కాదు. ఇది విశ్వవిద్యాలయాల నగరం. పరిశోధకుల నగరం. కోచింగ్ కోసం వచ్చిన యువత కలల నగరం. ప్రభుత్వ ఉద్యోగం కోసం ఏళ్ల తరబడి సిద్ధమవుతున్న యువత నగరం. ఫీజులు, స్కాలర్‌షిప్‌లు, హాస్టల్ సౌకర్యాలు, పరిశోధన నిధులు, ఉద్యోగాలు, సామాజిక న్యాయం వంటి అనేక ప్రశ్నలు ఒకేసారి ఇక్కడ కలుస్తాయి. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వంటి క్యాంపస్‌లు ఈ ప్రశ్నలకు విస్తృతమైన మేధో నేపథ్యాన్ని అందిస్తాయి. అక్కడ జరిగే చర్చ ఒక సభతో ముగియకూడదు. విద్యార్థి సమాజంలో కొత్త చర్చకు అది బీజం కావాలి. ఒక మీటింగ్ అయిపోయాక జనం ఇళ్లకు వెళ్లిపోవడం కాదు; ఆ చర్చ క్యాంపస్ జీవితంలోకి దిగాలి. ప్రశ్నలు పుడాలి. బృందాలు ఏర్పడాలి. కార్యాచరణ మొదలుకావాలి.

విజయవాడలో కూడా ఇదే సవాలు. ఆంధ్రప్రదేశ్‌లో విద్యార్థి యువత సమస్యలను కేవలం స్థానిక రాజకీయాల కోణంలో కాకుండా జాతీయ విద్యా ఉపాధి సంక్షోభంతో అనుసంధానించాల్సిన అవసరం ఉంది. రాష్ట్రంలోని ప్రభుత్వ విద్యాసంస్థల పరిస్థితి, ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు, ఉద్యోగ నియామకాలు, పోటీ పరీక్షలు, పరిశోధన అవకాశాలన్నీ విద్యార్థి ఉద్యమానికి కీలక అంశాలు. నేహా అక్కడికి వెళ్లడం అంటే ఒక ప్రసంగం చేయడం మాత్రమే కాదు. “మీ సమస్య ఏమిటి?” అని విద్యార్థులను అడగడం, “మీరు ఎలాంటి విద్యా వ్యవస్థ కోరుకుంటున్నారు?” అని ప్రశ్నించడం, “మీ భవిష్యత్తు గురించి మీరు నిర్ణయం తీసుకునే హక్కు కోసం ఏం చేయడానికి సిద్ధంగా ఉన్నారు?” అని చర్చ మొదలుపెట్టడం, ఇదే ఏఐఎస్ఏ రాజకీయానికి పరీక్ష. ఒక విద్యార్థి సంఘం బలం సభ్యుల సంఖ్యతో మాత్రమే కొలవలేం. క్యాంపస్‌లోని అత్యంత వెనుకబడిన విద్యార్థి తన సమస్యను చెప్పగలుగుతున్నాడా? గ్రామం నుంచి వచ్చిన మొదటి తరం విద్యార్థికి విశ్వవిద్యాలయంలో స్థానం ఉందా? దళిత, ఆదివాసీ, వెనుకబడిన తరగతులు, మైనారిటీలు, మహిళలు, పేద కుటుంబాల విద్యార్థులకు సమాన అవకాశాలు ఉన్నాయా? పరిశోధకుడికి స్వేచ్ఛ ఉందా? విద్యార్థి తన అభిప్రాయాన్ని భయపడకుండా చెప్పగలుగుతున్నాడా? ఈ ప్రశ్నలన్నింటినీ కలిపే చోటే ప్రజాస్వామ్య విద్యార్థి ఉద్యమం ఉంటుంది. అందుచేత ఏఐఎస్ఏ ముందున్న పని కేవలం వ్యతిరేకతను నమోదు చేయడం కాదు. ప్రత్యామ్నాయాన్ని నిర్మించడమే.

ప్రభుత్వ విద్య ఎలా ఉండాలి? విశ్వవిద్యాలయాలకు ఎంత స్వయం ప్రతిపత్తి ఉండాలి? విద్యార్థి సంఘాలకు ఎలాంటి ప్రజాస్వామ్య హక్కులు ఉండాలి? పరిశోధనకు ఎంత నిధులు అవసరం? పరీక్షా వ్యవస్థ ఎలా పారదర్శకంగా ఉండాలి? నిరుద్యోగ యువతకు ప్రభుత్వం ఏ విధమైన ఉపాధి విధానాన్ని రూపొందించాలి? విద్యలో సామాజిక న్యాయం ఎలా అమలు కావాలి?ఇలాంటి ప్రశ్నలకు సమాధానాలు చెప్పే విద్యార్థి ఉద్యమమే దీర్ఘకాలికంగా నిలబడగలదు. నేహా నాయకత్వంలో “జెన్ జెడ్ రైజింగ్” ఈ దిశగా అడుగు వేయగలిగితే, అది ఒక ప్రచార కార్యక్రమాన్ని మించి కొత్త విద్యార్థి రాజకీయ సంభాషణకు వేదిక అవుతుంది. ఇక్కడ మరో అంశం ముఖ్యమైనది భాష. యువతతో మాట్లాడేటప్పుడు ఉద్యమ భాష కూడా మారాలి. కేవలం రాజకీయ నినాదాలతో యువతను ఆకట్టుకోవడం సాధ్యం కాదు. వారి జీవితాన్ని అర్థం చేసుకునే భాష అవసరం.

“ఉద్యోగం లేదు” అన్న బాధను వినాలి, “పరీక్ష ఎప్పుడు?” అన్న ఆందోళనను అర్థం చేసుకోవాలి, “ఫీజు ఎలా కట్టాలి?” అన్న కుటుంబ ప్రశ్నను రాజకీయ ప్రశ్నగా చూడాలి, “నా పరిశోధనకు నిధులు ఎక్కడ?” అని అడిగే పరిశోధకుడి నిరాశను ఉద్యమంలోకి తీసుకురావాలి, “నా చదువు పూర్తయ్యాక నా పరిస్థితి ఏంటి?” అని అడిగే ప్రతి యువకుడి గుండె మాటను రాజకీయ సంభాషణలోకి తీసుకురావాలి. ఇక్కడి నుంచి ఏఐసఏకు ఒక పెద్ద అవకాశం ఉంది. జెన్ జెడ్‌ను కేవలం విద్యార్థుల సమూహంగా కాకుండా సమాజాన్ని మార్చగల సామాజిక శక్తిగా చూడాలి. విద్యార్థి అంటే రేపటి ఉద్యోగార్థి మాత్రమే కాదు. రేపటి ఉపాధ్యాయుడు, శాస్త్రవేత్త, ఇంజనీర్, వైద్యుడు, కళాకారుడు, జర్నలిస్టు, కార్మికుడు, రైతు కుటుంబానికి తిరిగి వెళ్లే యువకుడు, ప్రజా జీవితంలోకి వచ్చే పౌరుడు.

అందుకే క్యాంపస్‌లో ప్రజాస్వామ్యాన్ని కాపాడటం అంటే దేశ ప్రజాస్వామ్యానికి పునాది వేయడం. ఒక విశ్వవిద్యాలయంలో విద్యార్థి ప్రశ్నించగలిగితేనే రేపు సమాజంలో పౌరుడు ప్రశ్నించగలడు. ఒక క్యాంపస్‌లో అసమ్మతికి స్థానం ఉంటేనే రేపు దేశంలో భిన్నాభిప్రాయాలకు స్థానం ఉంటుంది. ఒక విద్యార్థి తన హక్కు కోసం నిలబడటం నేర్చుకుంటేనే రేపు ఒక కార్మికుడి హక్కు, రైతు హక్కు, మహిళ హక్కు, అణగారిన వర్గాల హక్కు గురించి ఆలోచించగలడు. ఇది విద్యార్థి ఉద్యమాన్ని సమాజ ఉద్యమంతో కలిపే రాజకీయ వంతెన. నేహా ఈ వంతెన నిర్మాణంలో ఒక ముందంజగా నిలవాల్సిన సమయం ఇది.

ఏఐఏస్ఏ కూడా ఒక విషయాన్ని మరచిపోకూడదు. యువతలోని కొత్త రాజకీయ చైతన్యాన్ని పాత నినాదాలతో మాత్రమే నిలబెట్టలేం. కొత్త ప్రశ్నలకు కొత్త రాజకీయ భాష అవసరం. డిజిటల్ తరానికి డిజిటల్ వేదికలు అవసరం. డిజిటల్ వేదికలతో పాటు నేలమీద సంఘటిత శక్తి కూడా అవసరం. వాట్సాప్ గ్రూప్ సమాచారాన్ని పంచగలదు. సోషల్ మీడియా ఒక సమస్యను దేశానికి చూపగలదు. కానీ క్యాంపస్‌లో విద్యార్థులను కలిపే సంఘటిత శక్తికి అవి ప్రత్యామ్నాయం కావు. ఒక పోస్ట్ వైరల్ కావచ్చు. ఒక వీడియో లక్షల మందికి చేరవచ్చు. కానీ ఆ వైరల్ క్షణాన్ని నిరంతర ఉద్యమంగా మార్చడానికి మనుషుల మధ్య సంబంధం కావాలి. సంఘటిత శక్తి కావాలి. నిబద్ధత కావాలి. ఆన్‌లైన్ నుంచి ఆఫ్‌లైన్‌కు, వ్యక్తిగత ఆవేదన నుంచి సామూహిక పోరాటానికి, ఒక్క గొంతు నుంచి వేల గొంతులకు, ఇదే జెన్ జెడ్ ఉద్యమానికి కీలకమైన ప్రయాణం. నేహా పర్యటన ఈ మార్పుకు వేదిక కావాలి. ప్రతి నగరంలో ఒక సభ ముగిసిన తర్వాత అక్కడ ఏమి మిగులుతుంది? ఒక ఫొటోనా? ఒక వీడియోనా? ఒక నినాదమా? లేక కొత్త విద్యార్థి బృందమా? కొత్త చర్చా వేదికనా? సమస్యలపై స్థానిక ఉద్యమమా? ఇదే “జెన్ జెడ్ రైజింగ్” విజయాన్ని కొలిచే అసలు ప్రమాణం. నేహా ఒక నగరానికి వెళ్లి తిరిగి వస్తుంది. కానీ అక్కడి విద్యార్థి ఉద్యమం కొనసాగాలి. అదే నాయకత్వానికి నిజమైన పరీక్ష.

ఇలాంటి సమయంలో ఏఐఏస్ఏ తన రాజకీయ వారసత్వాన్ని కొత్త తరంతో అనుసంధానించాలి. విద్యార్థి ఉద్యమ చరిత్రలో ఎన్నో పోరాటాలు జరిగాయి. కానీ ప్రతి తరానికి తనదైన ప్రశ్న ఉంటుంది. నేటి తరం ప్రశ్నలు డిజిటల్ ప్రపంచం, కృత్రిమ మేధస్సు, గిగ్ ఆర్థిక వ్యవస్థ, కాంట్రాక్టు ఉద్యోగాలు, విద్యా రుణాలు, పెరుగుతున్న ఫీజులు, పరీక్షా పోటీ, సామాజిక అసమానతలు వంటి కొత్త వాస్తవాలతో ముడిపడి ఉన్నాయి. ఈ కొత్త వాస్తవాలను అర్థం చేసుకోకుండా జెన్ జెడ్‌ను సంఘటితం చేయడం సాధ్యం కాదు. కాబట్టి నేహా ముందున్నది కేవలం దేశవ్యాప్త పర్యటన కాదు. ఒక కొత్త విద్యార్థి రాజకీయ పదజాలాన్ని నిర్మించే అవకాశం.

“ఉద్యోగం కావాలి” అన్న మాటను ఉపాధి హక్కుగా మార్చాలి. “ఫీజు తగ్గించండి” అన్న మాటను ప్రభుత్వ విద్యకు ప్రజా పెట్టుబడి పెంచాలి అనే డిమాండ్‌గా విస్తరించాలి. “పరీక్ష సరిగ్గా నిర్వహించండి” అన్న మాటను పరీక్షా వ్యవస్థకు పారదర్శకత, జవాబుదారీతనం కావాలి అనే ప్రశ్నగా మలచాలి. “క్యాంపస్‌లో మాట్లాడనివ్వండి” అన్న ఆవేదనను విద్యాసంస్థల్లో ప్రజాస్వామ్య హక్కులకు హామీ కావాలి అనే రాజకీయ డిమాండ్‌గా నిలబెట్టాలి. ఇదే విద్యార్థి సమస్యను ప్రజా సమస్యగా మార్చే ప్రక్రియ. జెన్ జెడ్‌కు నాయకత్వం వహించాలంటే వాళ్ల ముందు నడవడం మాత్రమే కాదు, వాళ్లతో కలిసి నడవాలి. వాళ్ల సందేహాలను స్వీకరించాలి. వాళ్ల విమర్శలను వినాలి. వాళ్ల కొత్త ఆలోచనలకు స్థలం ఇవ్వాలి. పాత అనుభవాన్ని కొత్త తరపు సృజనాత్మకతతో కలపాలి. నేహా ప్రయాణం ఆ దిశగా సాగితే, అది ఒక నాయకురాలి ఎదుగుదలగా మాత్రమే కాకుండా ఒక తరం రాజకీయ ఎదుగుదలగా నిలుస్తుంది. ఏఐఏస్ఏకు కూడా ఇదే చారిత్రక అవకాశం.

ఒక వైపు విద్యను మార్కెట్ వస్తువుగా మార్చే ప్రయత్నాలు. మరోవైపు యువతను కేవలం ఉద్యోగ మార్కెట్‌లో పోటీదారులుగా మార్చే ఆర్థిక విధానాలు. ఇంకోవైపు క్యాంపస్‌లలో ప్రశ్నించే గొంతులపై ఒత్తిళ్లుంటాయి. ఈ మూడు ధోరణులకు ఎదురుగా విద్యార్థి ఉద్యమం ఒక ప్రత్యామ్నాయ దృష్టిని ముందుకు తేవాలి. విద్య అందరికీ, ఉపాధి గౌరవప్రదంగా, క్యాంపస్ ప్రజాస్వామ్యంగా, పరిశోధన స్వేచ్ఛగా, సమాజం సమానత్వంతో.. ఇవి కేవలం నినాదాలు కాదు. జెన్ జెడ్ తన భవిష్యత్తును ఊహించుకునే కనీస హక్కులు. అందుకే నేహా పేరు ఒక వ్యక్తి పేరు నుంచి ఒక పిలుపుగా మారాలి. “నేహా వస్తోంది” అనేది వార్త మాత్రమే. “నేహా ఎందుకు వస్తోంది?” అనేది రాజకీయ ప్రశ్న. “ఆమె వచ్చిన తర్వాత మనం ఏం చేస్తాం?” అనేది ఉద్యమ ప్రశ్న. ఈ మూడో ప్రశ్నకే అసలు సమాధానం అవసరం. జంతర్ మంతర్ నుంచి ప్రారంభమైన స్వరం హైదరాబాద్‌కు చేరుతుంది. హైదరాబాద్ నుంచి విజయవాడకు వెళ్తుంది. అక్కడి నుంచి మరిన్ని క్యాంపస్‌లకు విస్తరిస్తుంది. ప్రతి ప్రాంతం తన స్వరాన్ని జతచేస్తుంది. ప్రతి విద్యార్థి తన అనుభవాన్ని జతచేస్తాడు. అప్పుడు “జెన్ జెడ్ రైజింగ్” ఒక వ్యక్తి పర్యటనగా మిగలదు. వేలాది యువ గొంతుల సమిష్టి స్వరంగా మారుతుంది. ఆ స్వరానికి నేహా ఒక ప్రతినిధి. ఆ స్వరం నేహాదొక్కటే కాదు. అది పరీక్షా ఫలితం కోసం ఎదురు చూస్తున్న విద్యార్థి స్వరం. ఉద్యోగ నోటిఫికేషన్ కోసం సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న యువకుడి స్వరం. ఫీజు కోసం తల్లిదండ్రుల మీద ఆధారపడుతున్న పేద విద్యార్థి స్వరం. పరిశోధనకు నిధులు లేక ప్రయోగశాలలో ఆగిపోయిన పరిశోధకుడి స్వరం. హాస్టల్ గదిలో భవిష్యత్తు గురించి ఆలోచిస్తున్న మొదటి తరం విద్యార్థి స్వరం. తన క్యాంపస్‌లో స్వేచ్ఛగా మాట్లాడాలని కోరుకునే యువతి స్వరం. సమానత్వం కోరుకునే ప్రతి విద్యార్థి స్వరం. ఈ స్వరాలన్నింటినీ ఒకే రాజకీయ వేదికపైకి తీసుకురావడమే ఏఐసఏ ముందున్న అసలు పని. నేహా పర్యటన ఆ పనికి ఒక చిచ్చుబుడ్డి కావచ్చు. చిచ్చుబుడ్డి మంటగా మారాలంటే పొడి కట్టెలు కావాలి. ఆ మంట వెలుగుగా మారాలంటే దాన్ని కాపాడే చేతులు కావాలి. ఆ వెలుగు మార్గంగా మారాలంటే ముందుకు నడిచే ప్రజలు కావాలి. అందుకే నేహా పర్యటన ముగింపు కాదు. అది ఒక ప్రారంభం. ఏఐఏస్ఏకు ఇది ఒక ప్రచార యాత్ర కాదు, కొత్త తరాన్ని వినే, కలిపే, సంఘటితం చేసే అవకాశం. జెన్ జెడ్‌కు ఇది ఒక సభ కాదు తమ భవిష్యత్తును తామే ప్రశ్నించే అవకాశం. దేశానికి ఇది ఒక పర్యటన కాదు యువతను కేవలం ఓటు బ్యాంకుగా కాకుండా ప్రజాస్వామ్యాన్ని నిర్మించే శక్తిగా చూడాల్సిన అవసరాన్ని గుర్తు చేసే సందర్భం. జంతర్ మంతర్‌లో ఒక గొంతు వినిపించింది. ఇప్పుడా గొంతు ఒక్కటిగా ఉండకూడదు.అది వేల గొంతులుగా,వేల గొంతులు లక్షల ప్రశ్నలుగా మారాలి. ఆ ప్రశ్నలు ఉద్యమంగా మారాలి.ఆ ఉద్యమం విద్యను హక్కుగా, ఉపాధిని గౌరవప్రదమైన హక్కుగా, క్యాంపస్‌ను ప్రజాస్వామ్య స్థలంగా, సమాజాన్ని సమానత్వపు దిశగా మార్చే రాజకీయ శక్తిగా ఎదగాలి. అప్పుడు మాత్రమే “జెన్ జెడ్ రైజింగ్” అనే పదానికి నిజమైన అర్థం వస్తుంది.

నేహా ఒక గొంతు.ఏఐఏస్ఏ ఒక వేదిక.లిబరేషన్ ఒక వైచారిక పునాది. జెన్ జెడ్ ఒక తరం. ఈ తరం తన భవిష్యత్తు కోసం లేస్తే.. ఆ స్వరం దేశ రాజకీయాల తలుపులు తట్టకుండా ఉండదు.

మామిండ్ల రమేష్ రాజా
7893230218



## ఆయిల్ పామ్ సాగుతోనే రైతులకు దీర్ఘకాలిక ఆర్థిక స్థిరత్వం

**జిల్లా కలెక్టర్ రాజర్షి షా**



**ఉట్నూర్,ఆగస్టు:14(తెలంగాణ వాణి )**
వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలంటే రైతులు సాంప్రదాయ పంటలతో పాటు వాణిజ్య పంటల సాగుపై దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా సూచించారు. ఇంద్రవెల్లి మండలం శంకర్‌గూడ గ్రామంలో ఆయిల్ పామ్ సాగుపై రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐటీడీఏ ఏపీఓ మంద మకరంద్‌తో కలిసి గ్రామంలో స్వయంగా ఆయిల్ పామ్ మొక్కలను నాటి రైతులను ప్రోత్సహించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, ఒకసారి ఆయిల్ పామ్ తోటను ఏర్పాటు చేస్తే సుమారు 25 నుంచి 30 సంవత్సరాల పాటు స్థిరమైన ఆదాయం పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ పంట ద్వారా రైతులు దీర్ఘకాలిక ఆర్థిక భద్రతను సాధించవచ్చని పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న మొక్కలు, డ్రిప్ ఇరిగేషన్ సబ్సిడీ, ఇతర ప్రోత్సాహక పథకాలను సద్వినియోగం చేసుకుని అధిక లాభాలు పొందాలని రైతులకు సూచించారు. ఐటీడీఏ ఏపీఓ మంద మకరంద్ మాట్లాడుతూ, ఏజెన్సీ ప్రాంతాల్లోని గిరిజన రైతుల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ఐటీడీఏ ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ సాగుకు అవసరమైన మొక్కలు, సాంకేతిక పరిజ్ఞానం అందించడంతో పాటు ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానం చేసి అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు. నీటి వసతి ఉన్న రైతులు ఆయిల్ పామ్ సాగును విస్తృతంగా చేపట్టి ఆదాయాన్ని పెంచుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి రవీందర్ సింగ్, జిల్లా ఉద్యాన అధికారి సందీప్ కుమార్, స్థానిక సర్పంచ్, వ్యవసాయ, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## ఉచితంగా ఐడీ కార్డుల వితరణ



**ఎల్లారెడ్డి, ఆగస్టు 14 (తెలంగాణ వాణి)**
ఎంపీపీఎస్ అన్నసాగర్ పాఠశాల విద్యార్థులకు పెరుగు వెంకటరమణ ఉచితంగా ఐడెంటిటీ కార్డులను విరాళంగా అందజేశారు. ఉద్యోగ విరమణ అనంతరం సొంత గ్రామ విద్యార్థులపై ప్రేమతో పాఠశాల అభివృద్ధికి చేసిన ఈ సహాయం అభినందనీయమని పాఠశాల ఉపాధ్యాయులు తెలిపారు. విద్యార్థుల క్రమశిక్షణ, గుర్తింపునకు ఈ ఐడీ కార్డులు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొంటూ వెంకటరమణకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## భోజనంలో పురుగులు.. అర్ధాకలితో విద్యార్థులు

**మందమర్రి, ఆగస్టు 14 (తెలంగాణ వాణి):**
మండల కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనంలో పురుగులు కనిపిస్తున్నాయని జనసేన యువసేన రాష్ట్ర అడహాక్ కమిటీ సభ్యులు మాయ రమేష్, తెలంగాణ విద్యార్థి జన సమితి జిల్లా అధ్యక్షుడు బచ్చలి ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. దీంతో విద్యార్థులు భోజనం చేయలేక అర్ధాకలితో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పాఠశాల ప్రారంభం నుంచే భోజన నాణ్యతపై విద్యార్థులు ఫిర్యాదు చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. జిల్లా కలెక్టర్ స్పందించి భోజన నాణ్యతపై తనిఖీలు నిర్వహించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.



## సన్‌రైజ్ విద్యార్థుల ప్రతిభ అభినందనీయం



**ఆదిలాబాద్, ఆగస్టు 14 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
జాతీయ, రాష్ట్ర స్థాయి ప్రవేశ పరీక్షల్లో ప్రతిభ కనబరిచి విశిష్ట ర్యాంకులు సాధించిన సన్‌రైజ్ ఎడ్యుకేషనల్ హబ్ విద్యార్థులను జిల్లా కలెక్టర్ రాజర్షి షా అభినందించారు. క్యాంపు కార్యాలయంలో విద్యార్థులు, తల్లిదండ్రులను సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. నీట్, ఐఐటీ, సీయూఈటీ, ఐఐఎస్ఈఆర్, ఈఏపీసెట్ తదితర పరీక్షల్లో 51 మంది విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించడం అభినందనీయమని కలెక్టర్ పేర్కొన్నారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగుతూ భవిష్యత్తులో సమాజాభివృద్ధికి సేవలందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి జాదవ్ గణేష్, సన్‌రైజ్ ఎడ్యుకేషనల్ హబ్ మేనేజింగ్ డైరెక్టర్లు, అకడమిక్ డైరెక్టర్లు, అధ్యాపకులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు

## విద్యార్థులకు చేయూత ఆధ్వర్యంలో భగవద్గీత శ్లోకాల పోటీలు

**ఎల్లారెడ్డి ఆగస్ట్ 14 తెలంగాణ వాణి ప్రతినిధి**
చేయూత గ్రూపు బాన్సువాడ కేంద్రంగా ఉభయ జిల్లాలైన నిజామాబాద్ మరియు కామారెడ్డి జిల్లాల వ్యాప్తంగా వివిధ కార్యక్రమాలు గో సేవా, గోశాలల అభివృద్ధికి పాటుపడుట, అనాధ పేద వృద్ధులకు మరియు అనాధ, పేద విద్యార్థులకు సహాయ సహకారములు అందించుట, అనుకోని సంఘటన వల్ల నిస్సహాయులైన వారికి చేయూతనివ్వడం లక్ష్యంగా కొనసాగుతుందనీ బాన్సువాడ చేయూత గ్రూపు నిర్వాహకులు నందల శంకర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ లో జరుగనున్న ఇట్టి గ్రూపు వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని తలపెట్టిన వివిధ కార్యక్రమాల్లో భాగంగా మొట్టమొదట విద్యార్థిని విద్యార్థులకు శ్రీమద్భగవద్గీత గ్రంథములోని వివిధ ఆధ్యాయాలపై శ్లోకాల పోటీలు తేది: 16-8-2026, ఆదివారం రోజు ఉదయం 10.30 గం. లకు శ్రీ హనుమాన్ మందిరము వ్యాయామశాల లో నిర్వహించబడుచున్నవనీ అన్నారు . ఇట్టి కార్యక్రమానికి విచ్చేయుచున్న వారందరికీ కూడా మధ్యాహ్న భోజన వసతి కలదని ఒక ప్రకటనలో తెలియజేశారు.



## పాంచజన్య సంకల్ప సభ పోస్టర్ ఆవిష్కరణ

**నిజామాబాద్, ఆగస్టు 14 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
ఈ నెల 31న నిజామాబాద్ కలెక్టర్ గ్రౌండ్‌లో నిర్వహించనున్న పాంచజన్య సంకల్ప సభ పోస్టర్‌ను తెలంగాణ రక్షణ సేన పార్టీ నాయకులు శుక్రవారం ఆవిష్కరించారు. పార్టీ ఆవిర్భావం తర్వాత తొలిసారిగా టీఆర్ఎస్ పార్టీ చీఫ్, మాజీ ఎంపీ కల్వకుంట్ల కవిత నిజామాబాద్ జిల్లాకు రానున్నారని నాయకులు తెలిపారు.భ ఏర్పాట్లపై నిజామాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. సభను విజయవంతం చేసేందుకు ప్రతి పల్లె నుంచి భారీగా కార్యకర్తలు, ప్రజలను తరలించాలని నాయకులు పిలుపునిచ్చారు. పార్టీ నిర్దేశించిన ఐదు లక్ష్యాలను సభలో కవిత వివరించనున్నట్లు తెలిపారు.పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి అలీం, కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ రఘు, రంగునవీన్ ఆచారి, ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి నవీన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. మిలాద్ ఉన్ నబీ సందర్భంగా సభ తేదీని ఈ నెల 31కి మార్చినట్లు నాయకులు వెల్లడించారు. ఈ సన్నాహక




సమావేశంలో టీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నవీన్ ఆచారి, పార్లమెంటు నియోజకవర్గం ఇంచార్జి ఎం.ఎ అలీమ్, కోరుట్ల నియోజకవర్గ ఇన్చార్జి డా. రఘు, మహిళా నాయకురాలు విజయ లక్ష్మి,టీఆర్ఎస్ పార్టీ జిల్లా ముఖ్య నాయకులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన గ్రామాల సమగ్రాభివృద్ధికి పెద్దపీట

- పిట్టబొంగారంలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం
- జిల్లా కలెక్టర్ రాజర్షి షా

**ఇంద్రవెల్లి, ఆగస్టు 14 (తెలంగాణ వాణి):**
గిరిజన, ఏజెన్సీ ప్రాంతాల సమగ్రాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. ప్రతి గిరిజన గ్రామంలో మౌలిక వసతులు, నాణ్యమైన విద్య, మెరుగైన వైద్యం, వ్యవసాయాభివృద్ధి, మహిళా సాధికారతకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు.ఇంద్రవెల్లి మండలం పిట్టబొంగారం గ్రామంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, ఐటీడీఏ పీవో మంద మకరంద్‌తో కలిసి కలెక్టర్ పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రహరీ గోడ, ప్రధాన్ కమ్యూనిటీ హాల్, నూతన గ్రామపంచాయతీ భవనం, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు.గిరిజన గ్రామాల అభివృద్ధికి ఐటీడీఏ, జిల్లా యంత్రాంగం సమన్వయంతో ఆరు సూత్రాల అభివృద్ధి ప్రణాళికను అమలు చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. మాతా--శిశు మరణాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, ప్రతి గర్భిణి రిమ్స్‌లో టిఫా స్కాన్ చేయించుకునేలా వైద్య సిబ్బంది పర్యవేక్షించాలని ఆదేశించారు. గిరిజన విద్యార్థులకు మెరుగైన విద్య అందించేందుకు ఎఫ్ఎల్ఎన్, ఎల్ఐపీ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామని



చెప్పారు. రైతులు జలసిరి పథకాన్ని వినియోగించుకోవాలని, వ్యవసాయ కుంటల ఏర్పాటుకు రూ.90 వేల నుంచి రూ.1.30 లక్షల వరకు ఆర్థిక సాయం అందుతుందని వివరించారు. డ్వాక్రా మహిళలకు బ్యాంకు లింకేజీల ద్వారా స్వయం ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు. ఎమ్మెల్యే బొజ్జు పటేల్ మాట్లాడుతూ మారుమూల గిరిజన గ్రామాలకు పట్టణాలకు దీటుగా మౌలిక వసతులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను కోరారు.ార్యక్రమంలో హౌసింగ్ పీడీ శంకర్, సర్పంచ్ మాదవి ఇంద్రదేవ్, పంచాయతీ కార్యదర్శి వనిత, స్థానిక ప్రజాప్రతినిధులు, ఆశా కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో పోలీసు--ప్రజల సత్సంబంధాలు బలోపేతం

- చప్రాల గ్రామంలో 'పోలీసులు మీకోసం' కార్యక్రమం
- జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

**బేలా, ఆగస్టు 14 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
గ్రామీణ ప్రాంతాల్లో పోలీసు--ప్రజల మధ్య సత్సంబంధాలను మరింత బలోపేతం చేయడంతో పాటు నేరాల నియంత్రణలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచడమే లక్ష్యంగా 'పోలీసులు మీకోసం' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు.శుక్రవారం బేలా మండలం చప్రాల గ్రామంలోని రైతు వేదికలో నిర్వహించిన కార్యక్రమంలో ఎస్పీ పాల్గొన్నారు. గ్రామస్తులు ఆదివాసీ సంప్రదాయాలతో ఘన స్వాగతం పలికారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలను వీక్షించి అభినందించారు. ఈ సందర్భంగా గంజాయి, మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామాల్లో గంజాయి సాగు లేదా మాదకద్రవ్యాల విక్రయాలు జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. రోడ్డు ప్రమాదాల నివారణకు హెల్మెట్ ధరించడం, అతివేగం, మద్యం సేవించి




వాహనాలు నడపడం, ట్రిపుల్ రైడింగ్‌కు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో 15 మంది వాహనదారులకు హెల్మెట్లు, పాఠశాల విద్యార్థులకు ఇండోర్ గేమ్స్ కిట్లను ఎస్పీ పంపిణీ చేశారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ పాల్గొనాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి, జైనథ్ సీఐ జి. శ్రావణ్ కుమార్, ఎస్ఐలు మధుకృష్ణ, పి. గౌతమ్, గ్రామ సర్పంచ్, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, మహిళలు, యువతతో పాటు సుమారు 500 మంది గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ప్రతి బొట్టు నీటిని ఒడిసిపట్టాలి

**జల సంరక్షణ పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ రాజర్షి షా**

**ఆదిలాబాద్, ఆగస్టు 14 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
వర్షపు నీటిని సద్వినియోగం చేసుకుని భూగర్భ జలాలను పెంచడంతో పాటు రైతులకు శాశ్వత నీటి వనరులు అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు.శుక్రవారం ఇంద్రవెల్లి మండలంలోని కేస్లాపూర్, పిట్టబొంగారం గ్రామపంచాయతీల పరిధిలో ఐటీడీఏ పీవో మంద మకరంద్‌తో కలిసి కొనసాగుతున్న జల సంరక్షణ పనులను కలెక్టర్ పరిశీలించారు. కేస్లాపూర్‌లో రైతుల కోసం నిర్మించిన ఫార్మ్ పాండ్‌ను తనిఖీ చేసి నీటి నిల్వ సామర్థ్యం, నిర్మాణ నాణ్యతను పరిశీలించారు. పిట్టబొంగారంలో బోర్‌వెల్ రీచార్జ్ నిర్మాణాలు, ఇతర నీటి సంరక్షణ పనులను పరిశీలించి మిగిలిన పనులను గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.
ప్రతి బొట్టు వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంచాలని కలెక్టర్ సూచించారు. ఫార్మ్ పాండ్లు, బోర్‌వెల్ రీచార్జ్ నిర్మాణాలు



ఎండిపోతున్న బోర్లకు పునర్జీవం పోసి వ్యవసాయానికి నీటి భద్రత కల్పిస్తాయని తెలిపారు. నీటి సంరక్షణను ప్రజా ఉద్యమంగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ రవీందర్ రాథోడ్, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.



## ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ నూతన కార్యాలయం

**పూజల్లో పాల్గొన్న మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి**

**ఆదిలాబాద్, ఆగస్టు : 14 ( తెలంగాణ వాణి ప్రతినిధి )**
ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని బాబు జగజ్జివన్ రామ్ చౌరస్తాలో విజయ డైరీ పక్కన గల కాంగ్రెస్ పార్టీ నూతన కార్యాలయంలో నేడు ప్రత్యేక పూజాది కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ శుభకార్యక్రమంలో డీసీసీ అధ్యక్షులు డా. నరేష్ జాదవ్ తో కలిసి ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి ప్రత్యేక పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం సర్వమత ప్రార్థనలు నిర్వహించి రెండో సారి ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి గారి సారధ్యంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మరింతగా ప్రజలకు సేవ చేసే అవకాశాన్ని కల్పించాలని ప్రార్థనల్లో నేతలు ఆకాంక్షించడం జరిగింది. నూతన కార్యాలయం వేదికగా పార్టీ కార్యకలాపాలను మరింత విస్తృతం చేస్తామని, ప్రజలకు మరింత చేరువవుతామని నాయకులు ఈ సందర్భంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బండారి అనూష సతీష్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ మల్లెపూల సత్యనారాయణ, మాజీ డీసీసీ అధ్యక్షులు సాజీద్ ఖాన్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లూరి సంజీవ్ రెడ్డి, మాజీ డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి పాలుపంచుకున్నారు.




## భక్తిశ్రద్ధలతో బంజారాల సంప్రదాయ పండుగ 'తీజ్'

**పాత కలెక్టరేట్ మైదానంలో ప్రత్యేక పూజలు**

**నిజామాబాద్, ఆగస్టు 14 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
బంజారా గిరిజనుల సంప్రదాయ పండుగ తీజ్ ఉత్సవాలను జిల్లా ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఈ నెల 14 నుంచి 23 వరకు తొమ్మిది రోజుల పాటు నిజామాబాద్ నగరంలోని పాత కలెక్టరేట్ మైదానంలో బంజారా మహిళలు, యువతులు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. తీజ్ పండుగ బంజారా సంస్కృతి, సంప్రదాయాలు, సాంస్కృతిక వారసత్వానికి ప్రతీకగా నిలుస్తుందని ఉపాధ్యాయురాలు విజయలక్ష్మి, డాక్టర్ సులోచన రాణి, డాక్టర్ బిలోజీ నాయక్ తెలిపారు. శుక్రవారం నిజామాబాద్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పెళ్లికాని యువతులు తొమ్మిది రోజుల పాటు గోధుమ విత్తనాలను బుట్టల్లో నాటి పవిత్రంగా నీరు పోస్తూ పూజలు చేస్తారని తెలిపారు. మంచి భవిష్యత్తు, సౌభాగ్యం, కుటుంబ శ్రేయస్సు కోసం పార్వతీదేవిని ప్రార్థిస్తారని చెప్పారు. పూజల్లో భాగంగా జానపద పాటలు, సంప్రదాయ నృత్యాలు, రంగవల్లులు, పూల అలంకరణలతో ఉత్సవాలను నిర్వహిస్తారని వివరించారు. తొమ్మిది రోజుల పూజల అనంతరం గోధుమ మొలకలను సమీపంలోని చెరువు లేదా నదిలో నిమజ్జనం చేస్తారని తెలిపారు. తీజ్ పండుగ బంజారా సమాజ ఐక్యత, సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే ప్రత్యేక వేడుకగా నిలుస్తుందని పేర్కొన్నారు. సమావేశంలో బంజారా సంఘాల ప్రతినిధులు, మహిళలు పాల్గొన్నారు.

## స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలి

- స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి పటిష్ట ఏర్పాట్లు
- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



**నిర్మల్, ఆగస్టు 14 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా, ఎలాంటి లోటుపాట్లు లేకుండా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఎన్టీఆర్ మినీ స్టేడియంలో శనివారం నిర్వహించనున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. పోలీస్ పరేడ్, ముఖ్య అతిథులు, ప్రజాప్రతినిధుల సీటింగ్, సాంస్కృతిక కార్యక్రమాలు, తాగునీరు, విద్యుత్, భద్రతా ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించి పలు సూచనలు చేశారు. కార్యక్రమం సజావుగా జరిగేలా అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. అనంతరం కడ్తాల్ సమీపంలోని సాగర్ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించనున్న స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమ ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించారు. లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ పరిశీలనలలో అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, డిఆర్ఓ రాథోడ్ రమేష్, డిఈఓ భోజన్న, అగ్నిమాపక అధికారి శివాజీ, డిఎస్పీ శ్రీనివాస్, పౌర సరఫరాల అధికారి రాజేందర్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలకు విట్టల్‌రెడ్డి పరామర్శ



**నిర్మల్ - ముథోల్: ఆగస్టు 14 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
ముథోల్ మాజీ ఎమ్మెల్యే జి. విట్టల్‌రెడ్డి నియోజకవర్గంలోని కుబీర్,కుంభీ,మొగిలి గ్రామాల్లో పర్యటించారు.ఇటీవల మృతి చెందిన పలువురి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.మృతుల చిత్రపటాలకు నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించారు.ఈ పర్యటనలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, సర్పంచులు,మాజీ ప్రజాప్రతి నిధులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## రూ.2.5 లక్షల మద్యం పట్టివేత

కథలాపూర్: మహారాష్ట్రలో విక్రయించాల్సిన మద్యాన్ని అక్రమంగా తెలంగాణకు తరలించి జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలంలో విక్రయిస్తున్న వ్యక్తులను ఎక్సైజ్ అధికారులు స్పెషల్ రైడ్ నిర్వహించి పట్టుకున్నారు. మహారాష్ట్రలో తక్కువ ధరకు లభించే కొన్ని కంపెనీలకు చెందిన మద్యాన్ని కొందరు వ్యక్తులు కలిసి తెలంగాణకు తీసుకువచ్చి ఓ బృందంగా ఏర్పడి గ్రామాల్లో విక్రయిస్తున్నారన్న సమాచారంతో అధికారులు దాడులు చేపట్టారు. మెట్‌పల్లి అబ్కారి శాఖ ఆధ్వర్యంలో స్పెషల్ పార్టీ బృందాలతో కలిసి శుక్రవారం గంభీర్‌పూర్, బొమ్మేన గ్రామాల్లో అక్రమంగా నిల్వ ఉంచిన మద్యంపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో సుమారు రూ.2.5 లక్షల విలువైన మద్యాన్ని పట్టుకున్నట్లు మెట్‌పల్లి ఎక్సైజ్ ఎస్‌హెచ్‌ఓ వినోద్ రాథోడ్ తెలిపారు.

## మారుమూల పల్లె నుంచి అంతర్జాతీయ పరిశోధకుడిగా.. ప్రొఫెసర్ డా. చందర్ అంగోత్ పవార్



**ఎల్లారెడ్డి, ఆగస్టు 14 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
మారుమూల గ్రామానికి చెందిన సాధారణ రైతు కుటుంబం నుంచి వచ్చిన ప్రొఫెసర్ (డా.) చందర్ అంగోత్ పవార్ విద్య, కృషి, పట్టుదలతో అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన పరిశోధకుడిగా ఎదిగారు. ఆయన ప్రస్థానం గ్రామీణ యువతకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది. మాచాపూర్/పెద్దరెడ్డి గ్రామానికి చెందిన చందర్ పవార్ హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ నుంచి ఎంఎస్సీ, ఎంటెక్, పీహెచ్‌డీ పూర్తి చేశారు. అనంతరం చైనాలోని జెజియాంగ్ యూనివర్సిటీలో పోస్ట్ డాక్టోరల్ రీసెర్చ్ సైంటిస్ట్‌గా, అమెరికాలోని టెక్సాస్ ఏఎం యూనివర్సిటీలో పరిశోధకుడిగా సేవలందించారు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని వీఎన్ఆర్ విజ్ఞాన జ్యోతి విశ్వవిద్యాలయంలో రసాయన శాస్త్ర విభాగంలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు.
నానోమెడిసిన్, బయోమెటీరియల్స్, డ్రగ్ డెలివరీ, క్యాన్సర్ చికిత్స వంటి అధునాతన రంగాల్లో ఆయన పరిశోధనలు చేస్తున్నారు. తాజాగా ఆయన బృందం రూపొందించిన »»**Biomimetic Nanoporous Carrier Capsules for Drug Delivery and Precision Cancer Therapyµµ** అనే పరిశోధనా వ్యాసం ప్రతిష్ఠాత్మక 'చీవఞ్ చ్మిఅశేవఞ్ఞఅశీశ్రీశీస్త్రఎ' జర్నల్‌లో ప్రచురణకు ఎంపికైంది.క్యాన్సర్ చికిత్సలో ఔషధాలను లక్షిత ప్రాంతాలకు సమర్థవంతంగా చేరవేసే విధంగా నానోపోరస్ క్యారియర్ క్యాప్సూల్స్ అభివృద్ధిపై ఈ పరిశోధన సాగింది. వ్యాసం ప్రచురణకు ఎంపిక కావడం ఆయన పరిశోధనా ప్రతిభకు అంతర్జాతీయ గుర్తింపుగా నిలిచింది.
తన పరిశోధనా విజయాన్ని తల్లిదండ్రులు జగిత్య నాయక్ అంగోత్, మారోని బాయి అంగోత్‌లకు అంకితం చేస్తున్నట్లు డా. చందర్ పవార్ తెలిపారు. ఆయన విజయంపై స్థానికులు, వీఎన్ఆర్ విజ్ఞాన జ్యోతి యూనివర్సిటీ యాజమాన్యం, అధ్యాపకులు, సహచరులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

## జిల్లాలో హెచ్ఐవి, ఎయిడ్స్‌పై రెండు నెలల అవగాహన ప్రచారం



**మంచిర్యాల, ఆగస్టు 14 (తెలంగాణ వాణి):**
జిల్లాలో హెచ్ఐవి, ఎయిడ్స్‌పై ప్రజల్లో అవగాహన పెంచేందుకు ఆగస్టు 12 నుంచి అక్టోబర్ 12 వరకు రెండు నెలలపాటు విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్ తెలిపారు. నస్పూర్ సమీకృత కార్యాలయాల భవన సముదాయంలోని వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో శుక్రవారం జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ రూపొందించిన స్వీయ ప్రమాద అంచనా క్యూఆర్ కోడ్‌ను ఆయన ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలు, కళాశాలలు, బహిరంగ ప్రదేశాల్లో అవగాహన కార్యక్రమాలతో పాటు ఇంటింటి ప్రచారం చేపడతామని తెలిపారు. హెచ్ఐవి నివారణలో స్వీయ ప్రమాద అంచనా ఎంతో కీలకమని పేర్కొన్నారు. సందేహాలు, గోప్యమైన కౌన్సెలింగ్ కోసం 1097 టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్ సేవలను వినియోగించుకోవాలని, సమీప ఐసీటీసీ కేంద్రాల్లో పరీక్షలు చేయించుకోవాలని ప్రజలకు సూచించారు.కార్యక్రమంలో జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్‌తో పాటు వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎర్రపహాడ్‌లో సమాచార హక్కు చట్టంపై అవగాహన



**ఎల్లారెడ్డి, ఆగస్టు 14 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
లింగంపేట్ మండలం ఎర్రపహాడ్‌లోని ఎంజేపీటీసీబీసీడబ్ల్యూఆర్ పాఠశాల, జూనియర్ కళాశాలలో సమాచార హక్కు చట్టం--2005పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ప్రిన్సిపాల్ బి.మంజుల అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సమాచార హక్కు చట్ట పరిరక్షణ కమిటీ రాష్ట్ర డైరెక్టర్ ఎం.ఏ. సలీం మాట్లాడుతూ ఆర్టీఐ చట్టం పేద ప్రజలకు వజ్రాయుధం వంటిదన్నారు. ఆర్టీఐ దరఖాస్తు విధానం, మొదటి, రెండో అప్పీళ్లపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యా హక్కు, బాల కార్మిక, బాల్య వివాహాల నివారణ చట్టాలపై వివరించారు. కామారెడ్డి జిల్లా సలహాదారు దండగుల లింగమయ్య, జిల్లా కార్యదర్శి లెగ్గల రాజు పాల్గొని చట్టాలను వినియోగించుకునే విధానం, అధికారుల నుంచి సమాచారం పొందడంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సలహాదారులు ఎస్.కె మదర్ పాషా, యాదగిరి గౌడ్, పాఠశాల సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు

## మద్దునూర్ గ్రామపంచాయతీలో గ్రామసభ కార్యక్రమంఏర్పాటు



**జగిత్యాల /బుగ్గారం: 14 ఆగస్టు (తెలంగాణ వాణి విలేకరి)**
జగిత్యాల జిల్లా బుగ్గారం మండలం మద్దునూరు గ్రామంలో శుక్రవారం రోజున గ్రామ సర్పంచ్ ( గాలి పెల్లి భారతి -మహేష్) అధ్యక్షతన గ్రామ సెక్రెటరీ ఆధ్వర్యంలో వార్డ్ మెంబర్స్ గ్రామ ప్రజలు సమూహంలో గ్రామ పలు అభివృద్ధి పనులు గుర్తించి, చేసిన పనుల బిల్లుపై చర్చ నిర్వహించి గ్రామ అభివృద్ధి లో భాగంగా గ్రామాన్ని అభివృద్ధి ఎలా చేస్తే బాగుంటదని గ్రామములో ఎలాంటి లోటుబాట్లు గ్రామ పరిశుభ్రత ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రభుత్వం నుండి ఆర్థిక బడ్జెట్ ప్రభుత్వం నుండి పొందే వివరాలు చర్చనీయకంగా గ్రామ సభలో చర్చించుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ నక్క సునీల్ మరియు సెక్రెటరీ రవి రాజ్ ప్రభుత్వ పథకాల అమలు పై సమీక్ష నిర్వహించడం జరిగింది. వార్డు సభ్యులు చుక్కల సందీప్, ఏనుగు తిరుపతి రెడ్డి,మేడిపల్లి ప్రణీత-మధుసుదన్, తరాల నాగేష్, ఆకుల మంగ- శ్రీనివాస్, ఆకుల రాజు, నక్క సునీల్, ఆశంపెల్లి రమ, గజ్జల సత్తయ్య, అంగన్వాడీ టీచర్ మాణిక్యం ఏఎన్ఎం శ్రీలత, జడ్.పి.హెచ్.ఎస్ హెచ్ఎం మధుకర్, ఎల్ ఎస్ ఏ ప్రశాంత్,నాయకులు, రైతులు , గ్రామ ప్రజలు, మాజీ సర్పంచ్ బత్తుల తిరుపతి, యువకులు తదితరు పాల్గొన్నారు

# జీ.జీ.హెచ్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్

- **అస్తవ్యస్థ పరిస్థితులు నెలకొని ఉండడం పట్ల అసంతృప్తి**
- **తక్షణమే పారిశుధ్య సమస్యను చక్కదిద్దాలని ఆదేశం**

**నిజామాబాద్, ఆగస్టు 14 : (తెలంగాణ వాణి ప్రతినిధి)**
నిజామాబాద్ నగరంలోని ప్రభుత్వ జిల్లా జనరల్ ఆసుపత్రి (జీ.జీ.హెచ్)ను కలెక్టర్ భవేష్ మిశ్రా శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రి చుట్టూ తిరుగుతూ పరిసరాలు, ఆవరణను ప్రతి అంగుళం పరిశీలించారు. అడుగడుగున నెలకొని ఉన్న అస్తవ్యస్థ పరిస్థితులను చూసి కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎనిమిది అంతస్తుల భవన సముదాయంతో కూడిన ఈ ఆసుపత్రిలో నిర్వహణ లోపాలు కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నాయని అన్నారు. అనేక చోట్ల డ్రైనేజీ పైప్ లైన్ల లీకేజీలు ఉండడం, ఆసుపత్రి ప్రాంగణంలో వ్యర్థ జలాలు నిలిచి ఉండడం, పరిసరాలు దుర్గంధం వెదజల్లుతూ ఉండడాన్ని గమనించిన కలెక్టర్ సంబంధిత అధికారుల పనితీరును ఆక్షేపించారు. ప్రత్యేకించి సానిటేషన్ విభాగం లోపాలను ఎత్తి చూపారు. పరిస్థితి ఇలా ఉంటే చికిత్స



కోసం వచ్చే వారు, ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న వారు వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉంటుందని అన్నారు. ఆస్పత్రి లోపలి భాగంతో పాటు, బయట ప్రాంగణంలోనూ ఏ ఒక్క చోట కూడా నీరు నిల్వ ఉండకూడదని అధికారులను ఆదేశించారు. ఆస్పత్రిలోని ఆవరణలో ఉన్న ఓపెన్ డ్రైనేజీల మీద పైకప్పు నిర్మించాలని, మురుగు జలాలు నిలిచిపోకుండా వాటిని శుభ్రం చేయించాలన్నారు. పారిశుద్ధ్య వ్యవస్థను చక్కదిద్దేందుకు చేపట్టాల్సిన చర్యలపై సమగ్ర పరిశీలన జరపాలని నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్ కు సూచించారు. ఎక్కడ కూడా చెత్తాచెదారం పేరుకుపోకుండా రోజువారీగా వెంటదివెంట తొలగిస్తూ ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా పకడ్బందీ పర్యవేక్షణ చేయాలని జీ.జీ.హెచ్ అధికారులను ఆదేశించారు. ఎక్కడబడితే అక్కడ వృధా నిర్మాణ సామాగ్రి పేరుకుపోయి ఉండడంతో తక్షణమే తొలగింపజేయాలని సూచించారు. ఆసుపత్రి ప్రాంగణం రహదారి అంతా గుంతలమయంగా మారినందున, తక్షణమే మరమ్మతులు చేయించాలని అన్నారు. కుక్కలు, పశువులు ఆసుపత్రి ఆవరణలోకి రాకుండా కట్టడి చర్యలు చేపట్టాలన్నారు. పారిశుధ్య పనుల విషయంలో నిర్లక్ష్యానికి తావులేకుండా అనునిత్యం పకడ్బందీ పర్యవేక్షణ చేయాలన్నారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ వి.భుజంగరావు, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాములు, ఇతర అధికారులు ఉన్నారు.

## నేడు అట్టహాసంగా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

**క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా పాలనాధికారి**

**నిజామాబాద్, ఆగస్టు 14 : (తెలంగాణ వాణి ప్రతినిధి)**
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి జిల్లా యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేసింది. నిజామాబాద్ నగరంలోని భూమారెడ్డి కన్వెన్షన్ హాల్ లో ఈ నెల 15న (శనివారం) మద్యాహ్నం రెండు గంటలకు లబ్దిదారులకు ముఖ్య అతిథిగా విచ్చేయనున్న ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి చేతుల మీదుగా స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేయనున్నారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ భవేష్ మిశ్రా శుక్రవారం జిల్లా అధికారులతో కలిసి భూమారెడ్డి కన్వెన్షన్ హాల్ ను సందర్శించి క్షేత్రస్థాయిలో ఏర్పాట్లు పరిశీలించారు. జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, రేషన్ కార్డులు కలిగి ఉన్న లబ్దిదారులు, రేషన్ డీలర్లు తదితరులు పెద్ద సంఖ్యలో హాజరు కానున్న నేపథ్యంలో





ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. పేద కుటుంబాల ప్రయోజనాలతో ముడిపడి ఉన్న ఈ కార్యక్రమాన్ని పూర్తి స్థాయిలో విజయవంతం చేసేలా ఆయా శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని సూచించారు. వాహనాల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా పార్కింగ్ వసతి ఉండాలని, వేదిక, సీటింగ్ అరేంజ్ మెంట్, సౌండ్ సిస్టం, ఎల్.ఈ.డీ స్క్రీన్లు తదితర ఏర్పాట్లను పక్కాగా సరిచూసుకోవాలని అన్నారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ వి.భుజంగరావు, జిల్లా రెవెన్యూ అధికారి బి.గీత, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, ఆర్డీఓ రాజేంద్ర కుమార్, ట్రైనీ ఆర్డీఓ సందీప్, డీఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి, డీఆర్డీఓ సాయన్న, సివిల్ సప్లైస్ డీ.ఎం ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

## తిరంగా ర్యాలీతో గుండె నిండా దేశభక్తి

- **దేశం కోసం ప్రాణాలర్పించిన వారి చరిత్ర చదవండి...**
- **అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ.**
- **రెపరెపలాడిన త్రివర్ణ పతాకం..**

**నిజామాబాద్ ఆగస్టు 14: (తెలంగాణ వాణి ప్రతినిధి)**
తిరంగా ర్యాలీతో అందరి గుండె నిండా దేశభక్తి ఉప్పొంగిందని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు. బీజేపీ ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలోని ఆర్ ఆర్ చౌరస్తా నుంచి గాంధీ చౌక్ వరకు తిరంగా ర్యాలీ నిర్వహించారు . ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఒకప్పుడు కేవలం స్వాతంత్ర దినోత్సవం రిపబ్లిక్ డే రోజున మాత్రమే జాతీయ జెండాలను ఆవిష్కరించే వారన్నారు. దేశ ప్రధాని నరేంద్ర మోడీ పిలుపుమేరకు 2022లో ఆజాదీ కా అమృత్ మహోత్సవంలో భాగంగా హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని ప్రారంభించారని గుర్తు చేశారు. దీంతో ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకం రెపరెపలాడుతుందన్నారు. ఇలాంటి కార్యక్రమం వల్ల దేశభక్తి పెంపొందడమే కాకుండా స్వాతంత్ర సమరయోధుల చరిత్ర తెలిసే అవకాశం ఉంటుందన్నారు. ప్రధానంగా కులం మతం ప్రాంతం అనే భేదాలు లేకుండా భారతీయుల ఐక్యత కోసం రూపొందించిన కార్యక్రమం అన్నారు





యువతలో జాతీయ భావాన్ని పెంపొందించడం దేశ నిర్మాణంలో ప్రతి పౌరుడి భాగస్వామ్యాన్ని పెంచడం ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. తిరంగా ర్యాలీ అంటే చేతిలో జెండా పట్టుకొని నడవడం మాత్రమే కాదని ప్రతి ఒక్కరి హృదయంలో దేశభక్తిని మన ఆలోచనలలో జాతీయతను చేతల్లో దేశ నిర్మాణాన్ని నింపుకోవడం అన్నారు.ఇప్పటి యువత స్వాతంత్ర సమరయోధుల పాఠాలు చదవాలని ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి తెలిపారు. చిన్న వయసులో ప్రాణాలర్పించిన భగత్ సింగ్, ఉద్దం సింగ్, చంద్ర శేఖర్ ఆజాద్, అబ్దుల్ కలాం తదితరుల చరిత్రను తెలుసుకోవాలన్నారు. దేశానికి వ్యతిరేకంగా ఎవరు మాట్లాడిన ఊరుకునేది లేదన్నారు. మతాల మధ్య చిచ్చు పెడితే వదిలేది లేదన్నారు. మువ్వన్నెల జెండా ముద్దాడాలంటే అదృష్టం ఉండాలని, దేశం సురక్షితంగా ఉంటుందంటే కారణం వారి త్యాగ ఫలితమే అన్నారు. తిరంగా ర్యాలీ ఆద్యంతం హుషారుగా కొనసాగింది. ర్యాలీలో 150 మీటర్ల భారీ త్రివర్ణ పతాకం ఎంతగానో ఆకట్టుకుంది. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు దినేష్ కులాచారి, జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి స్రవంతి రెడ్డి, కార్పొరేటర్లు, సీనియర్ నాయకులు, జిల్లా పదాధికారులు, మండల అధ్యక్షులు, స్వచ్ఛంద సంస్థల ప్రదినిధులు, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## నైతిక విలువలతోనే రాణించాలి

**- వీసీ ఉమేష్ కుమార్**

**తిమ్మాపూర్ ఆగస్టు 14 (తెలంగాణ వాణి ప్రతినిధి**
తిమ్మాపూర్ మండల కేంద్రంలోని శ్రీ చైతన్య ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్స్ ఆధ్వర్యంలో విద్యార్థుల గ్రాడ్యుయేషన్ సెర్మనీ అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకకు శాతవాహన యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ యు. ఉమేష్ కుమార్ ముఖ్యఅతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ డాక్టర్ ఉమేష్ కుమార్ మాట్లాడుతూ. .విద్యార్థులు పొందిన డిగ్రీలు కేవలం సర్టిఫికెట్లు మాత్రమే కాదని, సమాజం పట్ల బాధ్యతను పెంచుతాయని అన్నారు. ఫార్మసీ రంగం నేరుగా మానవ ఆరోగ్యంతో ముడిపడి ఉన్నందున, విద్యార్థులు జ్ఞానంతో పాటు నిజాయితీ, నైతిక విలువలను అలవర్చుకోవాలని సూచించారు.?శ్రీ చైతన్య విద్యా సంస్థల చైర్మన్ ముద్దసాని రమేష్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు కేవలం ఉద్యోగాల వేటకే పరిమితం కాకుండా మంచి వృత్తి నిపుణులుగా, బాధ్యతగల పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. పరిశోధన, ఆవిష్కరణలు, పారిశ్రామిక రంగాల్లోనూ రాణించాలని పిలుపునిచ్చారు.?డైరెక్టర్ కె. నరేందర్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థుల కఠిన శ్రమ, పట్టుదలకు ఈ గ్రాడ్యుయేషన్ దినం చక్కటి ప్రతిఫలమని కొనియాడారు. సంస్థల సెక్రటరీ ముద్దసాని సాయి చైతన్య రెడ్డి మాట్లాడుతూ.. ఫార్మసీ రంగంలో డ్రగ్ డిస్కవరీ, క్లినికల్ రీసెర్చ్, ఫార్మాకోవిజిలెన్స్ వంటి విభాగాల్లో ఉపాధి అవకాశాలు



పుష్కలంగా ఉన్నాయని తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఏ. రామ నరసింహ రెడ్డి కృత్రిమ మేధస్సు (ఏఐ), బయోటెక్నాలజీ వంటి నూతన రంగాల్లోని అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. అనంతరం బీఫార్మసీ, ఎంఫార్మసీ, ఫార్మా-డీ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులతో పాటు ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి అతిథుల చేతుల మీదుగా మెడల్స్, సర్టిఫికెట్లను అందజేశారు.ఈ కార్యక్రమంలో శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాల డాక్టర్ జి వెంకటేశ్వర్లు, ప్రిన్సిపల్ డాక్టర్ ప్రసాద్ రాజు, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ రామారావు, శ్రీ చైతన్య జూనియర్ కళాశాల డి జగన్మోహన్ రెడ్డి, డిగ్రీ అండ్ పీజీ కళాశాల ప్రిన్సిపల్ కృష్ణారెడ్డి, మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ స్వర్ణలత, మీడియా ఇంచార్జ్ గొంటి రమేష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు



## స్పోర్ట్స్ దుస్తులు పంపిణీ

**లక్షెటిపేట, ఆగస్టు 14(తెలంగాణ వాణి).**
లక్షెట్టిపేట మండలంలోని ఎల్లారం గ్రామపంచాయతీలోని ప్రాథమిక పాఠశాలలో గ్రామ సర్పంచ్ గొడిశల రాజేశం తన సొంత ఖర్చులతో విద్యార్థులకు ఉచితంగా స్పోర్ట్స్ డ్రెస్ లను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుతే భవిష్యత్ లో దేనినైన తట్టుకునే ఆత్మ విశ్వాసం కలుగుతుందన్నారు. ఆటల్లో రాణిస్తే మంచి ప్రభుత్వ ఉద్యోగాలు లభిస్తాయని తెలిపారు. స్పోర్ట్స్ డ్రెస్ లు పిల్లల్లో ఆటల పట్ల ఆసక్తిని ఏర్పరుస్తాయన్నారు. నేడు ప్రపంచంలో క్రీడలకు చాలా విలువ ఉందని వివరించారు. రాబోయే రోజుల్లో స్కూల్ యూనిఫామ్, టై, బెల్ట్ కూడా ఇవ్వనున్నట్లు తెలిపారు. గ్రామంలో ఉన్న ప్రతి తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. ఎల్లారం పాలక వర్గం విద్యకి అధిక ప్రాధాన్యతనిస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏం ఈ ఓ శైలజ,హెచ్ ఏం ఉమ,పంచాయతీ సెక్రెటరీ వరుణ్,టీచర్లు, వార్డు సభ్యులు,తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

## చెరువులో దూకి వృద్ధురాలి ఆత్మహత్య

**కోరుట్ల రూరల్, ఆగస్టు 14 (తెలంగాణ వాణి)**



మండలంలోని మాదాపూర్ గ్రామంలో విషాదం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కస్తూరి వెంకమ్మ (81) చెరువులో పడి మృతి చెందింది. కుటుంబ సభ్యుల సమాచారం మేరకు.. వెంకమ్మ కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నట్లు తెలిపారు.గతంలో కాలికి గాయం కావడంతో ఇన్ఫెక్షన్ ఏర్పడగా ఆపరేషన్ చేయించినట్లు కుటుంబ సభ్యులు వెల్లడించారు. ఈ నెల 13న మధ్యాహ్నం వెంకమ్మ ఇంటి నుంచి బయటకు వెళ్లింది. శుక్రవారం రోజున గ్రామ శివారులోని చెరువులో పడి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు గుర్తించారు. ఆత్మహత్య చేసుకునే ఉద్దేశంతోనే ఆమె చెరువులోకి వెళ్లి ఉంటుందని కుటుంబ సభ్యులు పోలీసులకు తెలిపారు.సమాచారం అందుకున్న పోలీసులు ఘటనపై వివరాలు సేకరించారు. మృతురాలి కుమార్తె భోదాసు లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై జి. శ్యామ్ రాజ్ తెలిపారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను దర్యాప్తు అనంతరం వెల్లడిస్తామని పోలీసులు పేర్కొన్నారు.

## శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీ గోదాదేవి తిరునక్షత్రోత్సవం

**రాజాపేట (తెలంగాణ వాణి విలేఖరి)**



యాదాద్రి భువనగిరి జిల్లా రాజపేట మండలం రఘునాథపురం కోరిన కోరికలు తీర్చే శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రావణమాసం శుక్రవారం శ్రీ గోదాదేవి అమ్మవారి తిరునక్షత్రోత్సవం పర్వదినాన్ని పునస్కరించుకుని ఆలయంలో ఉదయం ఆలయ అర్చకులు శ్రీమాన్ చక్రవర్తుల శ్రీనివాస చార్యులు శ్రీ స్వామి వారికి శ్రీ గోదా దేవి అమ్మవారికి శ్రీ పద్మావతి అమ్మవారికి పంచామృతాలతో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం నూతన వస్త్రాలతో పూలమాలలతో శోభాయమానంగా అలంకరించి అష్టోత్తర శతనామార్చనలు ప్రత్యేక పూజలు నిర్వహించారు .ఈ సందర్భంగా ఆలయ అర్చకులు శ్రీ గోదాదేవి అమ్మవారి గురించి ఈ విధంగా భక్తులకు తెలియజేశారు గోదాదేవి అమ్మవారు ధనుర్మాసంలో భక్తితో దీక్షగా వ్రతమాచరించి తిరుప్పావై పాశురాలతో భక్తి మార్గాన్ని ప్రబోధించి శ్రీరంగనాధుని చేపట్టిన ఆండాళ్ శ్రీ గోదాదేవి జన్మించిన ఈ తిధినాడు ఆ దేవతను పూజించి అనుగ్రహాన్ని పొందితే శ్రీమన్నారాయణ కూడా వారిని అనుగ్రహిస్తాడని ఈ సందర్భంగా భక్తులకు తెలియజేశారు. అనంతరం పంచ ప్రసాదాలతో శ్రీ స్వామి వారికి అమ్మవార్లకు నైవేద్య నివేదనలు చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులతో పాటు భక్తులు మహిళలు పాల్గొన్నారు.



## లక్ష్మమ్మ మృతికి నివాళులర్పించిన ' దైద '

**నకిరేకల్ : ఆగస్టు 14 (తెలంగాణ వాణి)**
నకిరేకల్ నియోజకవర్గ కేంద్రంలోని నిరుపేద కుటుంబానికి చెందిన ఒంటెపాక లక్ష్మమ్మ మరణించగా తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి దైద రవీందర్ పాల్గొని లక్ష్మమ్మ మృతికి పూలమాలవేసి, నివాళులర్పించి, దహన సంస్కారాల నిమిత్తం ఆర్థిక సహాయం అందించారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య : సర్పంచ్ సురుగు గౌరీ శ్రీనివాస్ గౌడ్

## దేవలమ నాగారం పాఠశాలల విద్యార్థులకు ఏకరూప దుస్తుల పంపిణీ



**చౌటుప్పల్, ఆగస్టు 14 (తెలంగాణ వాణి డివిజన్ ప్రతినిధి)**
ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్య లభిస్తుందని సర్పంచ్ సురుగు గౌరీ శ్రీనివాస్ గౌడ్ అన్నారు. చౌటుప్పల్ మండలం దేవలమ్మ నాగారం గ్రామం జిల్లా పరిషత్, మండల పరిషత్ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రభుత్వం అందించిన ఉచిత ఏకరూప దుస్తులను సర్పంచ్ సురుగు గౌరీ శ్రీనివాస్ గౌడ్ శుక్రవారం పంపిణీ చేశారు.సర్పంచ్ గౌరీ శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ బడిఈడు వయస్సు కలిగిన ప్రతి చిన్నారిని తప్పనిసరిగా పాఠశాలలో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. ప్రభుత్వం ప్రతి విద్యార్థికి ఏడాదికి రెండు జతల ఏకరూప దుస్తులు, ఉచిత పాఠ్యపుస్తకాలు అందించడంతో పాటు మధ్యాహ్న భోజనం అందించి విద్యార్థులకు వారానికి మూడు సార్లు గ్రుడ్లు అందిస్తుందన్నారు. విద్యార్థులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సుర్కంటి అనూప్ రెడ్డి, వార్డు సభ్యులు ఊదరి రమేష్, బొమ్మ అమరావతి, దోనూరి కిరణ్ రెడ్డ, పాక రాము, పంచాయతీ కార్యదర్శి సుధాకర్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చైర్మన్ గట్టు ప్రియాంక, మండల పరిషత్ పాఠశాల చైర్మన్ బొమ్మ సుగుణమ్మ, బొమ్మ రాములు, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

## హర్ ఘర్ తీరంగ ర్యాలీ



**వనపర్తి :ఆగస్టు 14,(తెలంగాణ వాణి ప్రతినిధి)**
నరేంద్ర మోడీ భారత ప్రధాని భారత్ ప్రభుత్వం పిలుపు మేరకు హర్ ఘర్ తీరంగ ర్యాలీ బిజెపి వనపర్తి మండల అధ్యక్షులు సంద వెంకటేష్ అధ్వార్వంలో వనపర్తి మండలంలోని చీమను కుంటపల్లెలో హర్ ఘర్ తీరంగ ర్యాలీ ఘనంగా నిర్వహించడం జరిగింది. ముఖ్య అతిథులుగా జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దిరాజు, జిల్లా కౌన్సిలింగ్ సభ్యులు వనపర్తి మండలం ఇన్చార్జి సురగొని రంగస్వామి గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ స్వతంత్ర సమరయోధులు త్యాగాల స్మరించుకుంటూ దేశ ప్రగతి ప్రథన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలనే సంకల్పంతో బిజెపి నాయకులు కార్యకర్తలు ప్రజలు విద్యార్థులు పాల్గొనడం జరిగింది ఈ కార్యక్రమంలో చీమను కుంటపల్లి బూతు అధ్యక్షులు శక్తి కేంద్రీ ఇన్చార్జులు సత్యనారాయణ, చెన్నయ్య యాదవ్,వాకిటి నిలేందర్ మధుసూదన్ రెడ్డి, బాలరాజ్, గ్రామ ప్రజలు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ముక్కు మూసుకుంటేనే రాకపోకలు

- డ్రైనేజ్ లేక రోడ్లపై మురుగునీరు
- దుర్వాసనతో కాలనీవాసులు అవస్థలు



**హసన్‌పర్తి, ఆగస్టు 14 తెలంగాణ వాణి ప్రతినిధి**
హసన్‌పర్తి మండల పరిధిలోని మున్సిపల్ కార్పొరేషన్ 1వ డివిజన్‌లో బాలాజీ గార్డెన్ పక్కన గల పద్మావతి నగర్ కాలనీ రోడ్ నంబర్ 4లో గల డ్రైనేజీ వ్యవస్థ వలన కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇళ్ల నుంచి వెలువడే మురుగు నీటితో పాటు వర్షపు నీరు వెళ్లేందుకు సరైన కాలువలు లేకపోవడంతో రోడ్లపైనే నీరు నిలిచిపోతోంది.మురుగు నీరు రోజుల తరబడి నిల్వ ఉండటంతో పరిసర ప్రాంతాల్లో తీవ్ర దుర్వాసన వెదజల్లుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిలిచిన నీటిలో దోమలు వృద్ధి చెంది మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మురుగు నీరు భూమిలోకి ఇంకిపోవడం వల్ల భూగర్భ జలాలు కలుషితమయ్యే ప్రమాదం కూడా ఉందని చెబుతున్నారు.డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు. మున్సిపల్ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ లేదా పక్కా మురుగు కాలువల నిర్మాణం చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# ఓటమి బాధలో పిచ్చిపిచ్చి వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదు

### ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

**వనపర్తి : ఆగష్టు 14, (తెలంగాణ వాణి ప్రతినిధి)**
ఎన్నికల్లో ఓటమి బాధ నుంచి ఇంకా బయటపడలేక తప్పుడు సమాచారంతో కాంగ్రెస్ ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై ఇష్టారీతిగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు అని శుక్రవారం వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ నేతల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.మేము అధికారంలో ఉన్నాం కాబట్టి సంయమనం పాటిస్తున్నాం. అంతమాత్రాన మేము భరిస్తున్నామని అనుకోవద్దు. మా కార్యకర్తలు మీకంటే రెండింతలు ఘాటుగా సమాధానం చెప్పగలరు. ఇక ముందు ఇష్టమొచ్చినట్లు ఏది పడితే అది మాట్లాడితే చూస్తూ ఊరుకోం. అని ఎమ్మెల్యే మేఘారెడ్డి స్పష్టం చేశారు.పోతిరెడ్డిపాడుపై ఇప్పుడు ప్రేమ ఎందుకు? బీఆర్ఎస్ నేతలు పెద్ద పుడింగుల్లా పోతిరెడ్డిపాడు ప్రాజెక్టును పరిశీలించేందుకు వెళ్లడంపై ఎమ్మెల్యే తీవ్రంగా స్పందించారు.2014 నుంచి 2023 వరకు బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి నిబంధనల ప్రకారం తీసుకెళ్లాల్సిన నీటి కంటే అధికంగా నీరు తరలిపోతుంటే అప్పటి పాలకులు ఎందుకు నోరు మెదపలేదని ప్రశ్నించారు. అప్పుడు రొయ్యల పులుసు, బిర్యానీ తింటూ చూస్తూ ఉండిపోయిన మీరు ఇప్పుడు మా ముఖ్యమంత్రి గారిని విమర్శించడానికి అర్హత లేని వ్యక్తులని ఖండించారు.బీఆర్ఎస్ హయాంలో ఒక్క ఎకరా అదనంగా నీరిచ్చారా?జూరాల లెఫ్ట్ మెయిన్ కెనాల్, రాజీవ్ భీమా ఫేజ్--2, కేఎల్ఐ కింద వనపర్తి నియోజకవర్గంలో 90,741 ఎకరాలకు సాగునీరు అందిస్తున్నామని, ఇవన్నీ 2014కు ముందు కాంగ్రెస్ పార్టీ హయాంలో నిర్మించిన ప్రాజెక్టుల ద్వారానే సాధ్యమవుతున్నాయని ఎమ్మెల్యే తెలిపారు.బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన




తర్వాత వనపర్తి నియోజకవర్గానికి ఒక్క ఎకరం అదనంగా సాగునీరు ఇచ్చారా?ఇచ్చి ఉంటే లెక్కలు చెప్పాలి" అని సవాల్ విసిరారు.పాలమూరు--రంగారెడ్డిని పూర్తి చేయలేకపోయారు పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి కమీషన్ల కోసం టెండర్లు పిలిచి ఏళ్ల తరబడి పూర్తి చేయకుండా వదిలేశారని ఎమ్మెల్యే ఆరోపించారు.అదే సమయంలో కాళేశ్వరం ప్రాజెక్టును తొందరపడి పూర్తి చేసి చివరకు కూలేశ్వరంగా మార్చారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పాలమూరు ప్రాజెక్టుకు రూ.5 వేల కోట్లు, ఇతర పెండింగ్ బిల్లులకు రూ.4 వేల కోట్లు చెల్లించామని తెలిపారు.పాలమూరు ప్రాజెక్టుకు రూ.27 వేల కోట్లు ఖర్చు చేసినట్లు చెప్పుకున్న బీఆర్ఎస్ ప్రభుత్వం వనపర్తి ప్రజలకు ఎన్ని ఎకరాలకు సాగునీరు అందించిందో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.ముందు కవితకు సమాధానం చెప్పండి.. ఆ తర్వాత మాపై మాట్లాడండ కాదు ముందుగా కవిత చేసిన వ్యాఖ్యలకు బీఆర్ఎస్ నాయకులు సమాధానం చెప్పాలి. ఆ తర్వాతే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించే నైతిక హక్కు గురించి మాట్లాడాలి" అని ఎమ్మెల్యే మేఘారెడ్డి అన్నారు.కేటీఆర్ ఏమీ తిస్మార్‌ఖాన్ కాదని, "కేటీఆర్ సిరిసిల్ల ఎమ్మెల్యే.. నేను వనపర్తి ఎమ్మెల్యేను. ప్రతి మాటకూ ముఖ్యమంత్రిని విమర్శిస్తే చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదు" అని హెచ్చరించారు.ఒక్క రోజులో 4 టీఎంసీల నీరు ఎలా పారుతుందో చెప్పాలి.ఆగస్టు 1న ఎల్లూరు, ఆగస్టు 2న సింగోటం--జొన్నలబొగుడ, ఆగస్టు 3న గుడిపల్లి రిజర్వాయర్ నుంచి నీటిని విడుదల చేశామని ఎమ్మెల్యే తెలిపారు.మేము ప్రెస్‌మీట్ పెడతామంటేనే నీళ్లు వదిలారని కొందరు చెబుతున్నారు. ఒక్క రోజులో 4 టీఎంసీల నీరు ఎలా పారుతుందో కనీస తెలివి ఉన్నవారు చెప్పాలి నీటి ప్రవాహం, ప్రాజెక్టుల నిర్వహణపై కనీస అవగాహన లేకుండా మాట్లాడటం మానుకోవాలని హెచ్చరించారు.86 శాతం ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తి ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ బీఎల్ఏలు విజయవంతంగా పూర్తి చేశారని ఎమ్మెల్యే తెలిపారు.డబుల్ ఓట్లను తొలగించడం వల్ల వనపర్తి, పెబ్బేరు పట్టణాల్లో ఓట్ల సంఖ్య తగ్గిందని, మొత్తంగా వనపర్తి సెగ్మెంట్‌లో 86 శాతం ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తి చేశామని వెల్లడించారు.ఈ నెలాఖరులో పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ వనపర్తి పర్యటనకు రానున్నారని ఎమ్మెల్యే తెలిపారు.హద్దులు దాటితే కాంగ్రెస్ కార్యకర్తలు ఊరుకోరు. చివరగా బీఆర్ఎస్ నేతలకు ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి తీవ్ర హెచ్చరిక జారీ చేశారు.ఎమ్మెల్యే నుంచి మొదలుకొని గ్రామస్థాయి కాంగ్రెస్ కార్యకర్త వరకు ఎవరినైనా తప్పుడు సమాచారంతో ఇష్టారీతిగా మాట్లాడితే మా కార్యకర్తలు వారి భరతం పట్టక మానరు. విమర్శకు ప్రతి విమర్శ వరకు ప్రజాస్వామ్యంలో సహజమే. కానీ దిగజారి వ్యక్తిగతంగా మాట్లాడితే మా కార్యకర్తలు కూడా అదే స్థాయిలో స్పందిస్తారు. సంయమనం పాటిస్తున్నామని బలహీనులం అనుకోవద్దు. హద్దులు దాటితే కాంగ్రెస్ శ్రేణుల నుంచి గట్టి సమాధానం తప్పదు" అని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ఘాటుగా హెచ్చరించారు. ఈ ప్రెస్ మీట్ లో వనపర్తి డిసిసి అధ్యక్షులు శివసేనారెడ్డి, మున్సిపల్ చైర్మన్ మాధవి రమేష్, వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, పట్టణాధ్యక్షుడు కదిరి రాములు,కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అంతర్‌రాష్ట్ర బైక్ దొంగల ముఠా గుట్టురట్టు

- 18 బైక్ చోరీ కేసులు ఛేదించిన పెబ్బేరు పోలీసులు.. నలుగురు అరెస్ట్
- జిల్లా ఎస్పీ సునీతా రెడ్డి

**వనపర్తి, ఆగస్టు 14 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
జల్సాల కోసం బైక్ దొంగతనాలను వృత్తిగా మార్చుకుని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో వరుస చోరీలకు పాల్పడుతున్న అంతర్‌రాష్ట్ర బైక్ దొంగల ముఠాను పెబ్బేరు పోలీసులు పట్టుకున్నారు. నలుగురు నిందితులను అరెస్ట్ చేసి వారి నుంచి 18 చోరీ బైక్‌లను గుర్తించారు. వీటి విలువ సుమారు రూ.12.50 లక్షలు ఉంటుందని జిల్లా ఎస్పీ సునీతా రెడ్డి తెలిపారు.శుక్రవారం పెబ్బేరు పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఎస్పీ కేసు వివరాలు వెల్లడించారు. చెలిమిల్ల గ్రామానికి చెందిన కుర్వ శ్రీరాములు బైక్ చోరీపై ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై వెంకటేష్ గౌడ్ ఆధ్వర్యంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. వాహనాల తనిఖీల సందర్భంగా అమీర్ హంజా పఠాన్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా, తన సోదరుడు పఠాన్ నబీఖాన్‌తో కలిసి బైక్‌లను చోరీ చేస్తున్నట్లు వెల్లడించినట్లు తెలిపారు.గత రెండు నెలల్లో తెలంగాణలో 8, ఆంధ్రప్రదేశ్‌లో 10 బైక్‌లను చోరీ చేసినట్లు విచారణలో తేలిందన్నారు. చోరీ చేసిన వాహనాలను ఆత్మకూరుకు తరలించి విక్రయించేందుకు రమేష్, వెంకటరమణలతో ఒప్పందం





చేసుకున్నట్లు తెలిపారు. పెబ్బేరు, కొత్తకోట, గద్వాల, మానోపాడు, శాంతినగర్‌తో పాటు ఏపీలోని కర్నూలు, దోర్నాల, పాణ్యం, ఎర్రగొండపాలెం, మార్కాపురం ప్రాంతాల్లో చోరీలకు పాల్పడినట్లు వెల్లడించారు.ప్రధాన నిందితుడు అమీర్ హంజా పఠాన్‌పై గతంలో ఒక కేసు ఉండగా, పఠాన్ నబీఖాన్‌పై వివిధ నేరాలకు సంబంధించి 14 కేసులు ఉన్నాయని ఎస్పీ తెలిపారు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. వాహనదారులు బైక్‌లను పార్కింగ్ చేసేటప్పుడు హ్యాండిల్, సైడ్ లాక్‌లు తప్పనిసరిగా వేసి, సురక్షిత ప్రాంతాల్లో పార్క్ చేయాలని ఎస్పీ సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల కదలికలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. కేసును ఛేదించడంలో సమర్థవంతంగా పనిచేసిన వనపర్తి డీఎస్పీ గిరిబాబు, కొత్తకోట సీఐ రాంబాబు, పెబ్బేరు ఎస్సై వెంకటేష్ గౌడ్లను ఎస్పీ అభినందించారు.అదేవిధంగా నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్ రెడ్డి, కానిస్టేబుళ్లు నరసింహ, విజయ్, రైటర్ ఆంజనేయులులను నగదు బహుమతితో అభినందించారు.ఈ కార్యక్రమంలో కొత్తకోట సీఐ, రాంబాబు, పెబ్బేరు ఎస్సై, వెంకటేష్ గౌడ్, పోలీసు సిబ్బంది తదితరులు ఉన్నారు.

# గుడుంబా వస్తావురాలపై మెరుపు దాడులు

- 1900 లీటర్ల చక్కెర పానకం
- 55 లీటర్ల నాటు సారా 60 కేజీల బెల్లం 10 కేజీల పట్టిక స్వాధీనం

**నర్సంపేట: ఆగస్టు 14(తెలంగాణ వాణి ప్రతినిధి)**
డిప్యూటీ కమిషనర్ దత్త రాజు గౌడ్ , అసిస్టెంట్ కమిషనర్ నవీన్ కుమార్ ఆదేశాల మేరకు నాటు సారా నిర్మూలన కొరకు రూపొందించిన ప్రత్యేక కార్యాచరణలో భాగంగా నర్సంపేట స్టేషన్ పరిధిలో నల్లబెల్లి మండలం నందిగామ, రేలకుంట గ్రామాలలో నర్సంపేట స్టేషన్, పరకాల స్టేషన్, టాస్క్ ఫోర్స్, ఎన్ఫోర్స్మెంట్ బృందాలతో కలిసి ఉధృతమైన దాడులు నిర్వహించడం జరిగింది. ఈ దాడులలో 1900 లీటర్ల చక్కెర పానకాన్ని ధ్వంసం చేసి 55 లీటర్ల నాటు సారా 60 కేజీల బెల్లం 10 కేజీల పట్టిక స్వాధీనం చేసుకొని 9మంది వ్యక్తులపై కేసులు నమోదు చేయడం జరిగింది. ఈ దాడులలో ట్రైని అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరిండెంట్ లు లక్ష్మణ్



ఆనంద్, నీలోఫర్, సుచిత టాస్క్ ఫోర్స్ సిఐ రమేష్ చందర్ , ఎన్ఫోర్స్మెంట్ సీఐలు నాగయ్య, నాగేశ్వరరావు, ఎస్సైలు చంద్రశేఖర్, సులోచన, షరీఫ్, సురేష్ రెడ్డి మరియు సిబ్బంది పాల్గొన్నారు .

## ఆత్మగౌరవం కోసం పోరాడి ప్రత్యేక తెలంగాణ సాధించుకున్నాం

**కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతా: ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి**

**చౌటుప్పల్, ఆగస్టు 14 (తెలంగాణ వాణి డివిజన్ ప్రతినిధి):**



తెలంగాణ ప్రజలు ఆత్మగౌరవం కోసం పోరాడి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించుకున్నారని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. తెలంగాణ ఇచ్చింది, తెచ్చింది కాంగ్రెస్ పార్టీయేనని పేర్కొన్నారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతానని స్పష్టం చేశారు. చౌటుప్పల్‌లోని సీతారామచంద్ర స్వామి ఆలయ పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో శుక్రవారం పాల్గొన్న ఆయన అనంతరం మీడియాతో మాట్లాడారు. తాను కాంగ్రెస్ పార్టీ నాయకులను విమర్శించలేదని, ఇతర పార్టీల నుంచి వచ్చిన నాయకుల పెత్తనం పెరుగుతోందనే విషయాన్ని మాత్రమే ప్రస్తావించానని తెలిపారు. నిజమైన కాంగ్రెస్ నాయకులను అణిచివేయకుండా ఉద్యమకారులకు తగిన గుర్తింపు ఇవ్వాలని కోరారు. తెలంగాణ ప్రభుత్వం ప్రజా పాలనను కొనసా గిస్తూ పేదల సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. పెట్టుబడిదారులు, కాంట్రాక్టర్లు, ఇతర ప్రాంతాల నాయకుల ప్రయోజనాల కంటే తెలంగాణ ప్రజల ప్రయోజనాలే ముఖ్యమని అన్నారు. తెలంగాణ అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని రాజగోపాల్ రెడ్డి పేర్కొన్నారు.




## పోయిన బంగారం బాధితురాలికి అప్పగింత

**ధర్మారం,ఆగస్ట్ 14 (తెలంగాణ వాణి ప్రతినిధి )**
జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన ఎనగందుల స్రవంతి గురువారం ధర్మారం మండల కేంద్రంలోని మా- షాపింగ్ మాల్ లో దుస్తులు కొనుగోలు చేసుకుని వెళుతుండగా ఆమె ముప్పావు తులం బంగారం పుస్తెలు -గుండ్లు పోగొట్టుకున్నది. అనంతరం ఆమె వెంటనే ధర్మారం ఎస్సై ఎం ప్రవీణ్ కుమార్ కు సమాచారం అందించగా ఎస్సై కానిస్టేబుల్ సతీష్ ద్వారా సీసీ కెమెరా ఫుటేజీలను పరిశీలన చేయించారు. బంగారం ఉన్న పర్సు తీసుకున్న వ్యక్తిని గుర్తించిన కానిస్టేబుల్ సతీష్ వెంటనే అతన్ని పోలీస్ స్టేషన్ కు రప్పించి అట్టి బంగారాన్ని స్వాధీన పరచుకున్నారు. అనంతరం బాధితురాలైన స్రవంతికి శుక్రవారం అట్టి బంగారాన్ని అందించారు. బంగారం సేకరించి అందించిన ధర్మారం ఎస్సై ప్రవీణ్ కుమార్, కానిస్టేబుల్ సతీష్ కు స్రవంతి కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లనే కళ్యాణ లక్ష్మి పథకంపై స్టే - గోవర్ధన్

**నాంపల్లి: ఆగస్టు 14 (తెలంగాణ వాణి ప్రతినిధి)**



కాంగ్రెస్ ప్రభుత్వం, రేవంత్ రెడ్డి నిర్లక్ష్యం వల్లనే కళ్యాణ లక్ష్మి మరియు షాదీ ముబారక్ పథకంపై న్యాయస్థానం స్టే విధించిందని బిఆర్ఎస్ యువ నాయకులు బుడిగపాక గోవర్ధన్ మండిపడ్డారు. పేదింటి బిడ్డలకు ఈ పథకాల ఫలాలు అందకూడదని ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంది. కాబట్టే హైకోర్టులో దాఖలైన పిటీషన్ పై కౌంటర్ దాఖలు చేయడానికి పలుమార్లు అవకాశం ఇచ్చిన స్పందించకపోవడం ఈ ప్రభుత్వం బాధ్యత రహితానికి ప్రత్యక్ష నిదర్శనమని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఉన్నత న్యాయస్థానంలో కౌంటర్ దాఖలు చేసి స్టే ఎత్తివేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు

## ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరాలి



**వనపర్తి : ఆగస్టు 14, (తెలంగాణ వాణి ప్రతినిధి)**
ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆదేశాల మేరకు దేశ వ్యాప్తంగా జరుగుతున్న హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ఈరోజు వనపర్తిలోని 13వ వార్డు, 30వ వార్డులలో జెండా కార్యక్రమం నిర్వహించిన జిల్లా బీజేపీ అధికార ప్రతినిధి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు సోదర భావంతో భేదం లేకుండా కలిసిమెలిసి ఉండే జెండా పండుగ చేసుకోవాలని తెలిపారు.ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకం ఎగురవేసి, దేశభక్తిని చాటడం, స్వాతంత్ర్య స్ఫూర్తిని యువతలో పెంపొందించడమే ఈ కార్యక్రమ లక్ష్యం ప్రజలందరూ ఉత్సాహంగా పాల్గొని "భారత్ మాతా కీ జై" నినాదాలతో వాతావరణాన్ని జాతీయ భావంతో నింపారు ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా అధ్యక్షులు కొమ్ము శ్రీనివాసులు, 13వ వార్డ్ కౌన్సిలర్ అభ్యర్థి గోపీనాథ్, బిజెపి సీనియర్ నాయకులు బత్తిని మధుసూదన్, మైనార్టీ నాయకులు ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టు జగదీష్‌ను సన్మానించిన ఏసీపీ




**నర్సంపేట, ఆగస్టు 14 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
రోడ్డుపై లభించిన రూ.లక్ష విలువైన బ్యాంకు చెక్కును సంబంధిత కుటుంబానికి తిరిగి అందించి నిజాయితీ చాటుకున్న జర్నలిస్టు మహాదేవుని జగదీష్‌ను నర్సంపేట ఏసీపీ పి. రవీందర్ రెడ్డి అభినందించి సన్మానించారు. జూలై 19న నర్సంపేటలో జగదీష్‌కు చెక్కు లభించగా, యజమానిని గుర్తించి బాధిత కుటుంబానికి అప్పగించారు. ఈ సందర్భంగా ఏసీపీ కార్యాలయంలో జగదీష్‌ను శాలువాతో సత్కరించి పుష్ప గుచ్ఛం అందజేశారు. జగదీష్ చూపిన నిజాయితీ, సామాజిక బాధ్యత ఇతరులకు ఆదర్శమని ఏసీపీ పేర్కొన్నారు. కార్యక్రమంలో పోలీసు అధికారులు, సిబ్బంది, జర్నలిస్టులు పాల్గొన్నారు.



## బిఎల్‌ఏలు, సీనియర్ నాయకులకు ఘన సన్మానం

**కుత్బుల్లాపూర్, ఆగస్టు 14 (తెలంగాణ వాణి):**
ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ సూచనల మేరకు బహదూర్‌పల్లి పరిధిలోని మేకల వెంకటేశం ఫంక్షన్ హాల్‌లో ూ×=–2026 కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దుండిగల్, బౌరంపేట్, బహదూర్‌పల్లి డివిజన్లకు చెందిన కాంగ్రెస్ పార్టీ దీూాలు, సీనియర్ నాయకులు, డివిజన్ అధ్యక్షులు పాల్గొన్నారు. ూ×=–2026 కార్యక్రమంలో అంకితభావంతో పనిచేసిన దీూాలు, సీనియర్ నాయకులు, డివిజన్ అధ్యక్షులను ఘనంగా సన్మానించి వారి సేవలను అభినందించారు. కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ ఏపీ మిథున్ రెడ్డి, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్, మాజీ టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి, స్టేట్ ప్రోటోకాల్ వైస్ చైర్మన్ బొంగునూరి కిషోర్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి, ఐజజ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ పాలకవర్గ సభ్యులు నిజాయితీగా పని చేయాలి

- భక్తులకు అసౌకర్యం కలగకుండా చూడాలి.
- మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి



**చౌటుప్పల్, ఆగస్టు 14 (తెలంగాణ వాణి డివిజన్ ప్రతినిధి)**
చౌటుప్పల్ మున్సిపల్ పట్టణం భవాని నగర్ లోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారం కార్యక్రమంలో మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి శుక్రవారం పాల్గొని చైర్మన్, ధర్మ కర్తలను అభినందించి, ప్రమాణ స్వీకారం చే పించారు. ఆలయానికి వచ్చిన ఎమ్మెల్యేకు పూర్ణకుంభం వేదమంత్రాలతో స్వాగతం పలికిన ఆలయ అర్చకులు, పాలకమండలి సభ్యులు ఈ సందర్భంగా రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ దేవుడి విషయంలో నిజాయితీగా పని చేస్తూ భక్తులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా చూడాలని కోరారు. ఆలయ సమస్యలు ఏమైనా ఉంటే తన దృష్టికి తీసుకురావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఒక పూట అన్నం అది జన్మజన్మల పుణ్యం



**హుజూర్ నగర్ ఆగస్టు 14 తెలంగాణ వాణి**
హుజూర్ నగర్ పట్టణానికి అతి సమీపాన స్వయంభుగా వెలిసిన స్వామి పడగ రాయి గుట్ట స్వయంభు శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆ స్వామి సన్నిధిలో ప్రతి శుక్రవారం దాతల సహకారంతో ఆలయ కమిటీ వారు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నారు అంతేకాకుండా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఇట్టి అన్నదాన కార్యక్రమం దాత. ధూపాటి . సక్కుబాయి హుజూర్ నగర్ వాస్తవ్యులు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వామివారి సన్నిధిలో అన్నదాన కార్యక్రమం చేయడం నా అదృష్టముగా భావిస్తున్నాము అని తెలియజేశారు అదేవిధంగా ఆలయ కమిటీ వారు మాట్లాడుతూ ప్రతి శుక్రవారం భక్తులు తమ దాతృత్వం చాటుకుంటున్నారు స్వామి వారి సన్నిధికి వచ్చే భక్తులకు ఎటువంటి ఆటంకాలు కలక్కుండా అన్ని ఏర్పాట్లు ఆలయ కమిటీ చూసుకుంటున్నారు అంతేకాకుండా ఆలయ కమిటీ వారు ప్రతి శుక్రవారం అందుబాటులో ఉంటూ ఆలయ అభివృద్ధికి తోడ్పడుతున్నారు అదేవిధంగా .భక్తులు తమ వంతు సహాయ సహకారాలు అందించాలని ఆ దేవుని కరుణ కటాక్షాలు మీ మీద ఉండాలని ఆలయ కమిటీ వారు తెలియజేశారు ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు శాగం రెడ్డి కృష్ణారెడ్డి ప్రధాన కార్యదర్శి పొనుగుపాటి వెంకటేశ్వరరావు కోశాధికారి గుర్రం చిన్న వెంకటరెడ్డి ఉపాధ్యక్షులు తోడేటి సర్వయ్య వీరవల్లి గురునాథం శంకరమ్మ అమరోజ్ నాగరాజ్ భక్తులు తదితరులు పాల్గొన్నారు

## విజేతలకు బెల్ట్ గ్రేడింగ్ సర్టిఫికెట్లు అందజేత

- టైక్వాండోతో ఆత్మవిశ్వాసం క్రమశిక్షణ పెంపు
- ఆడపిల్లలకు స్వీయరక్షణపై దృష్టి



**వనపర్తి : ఆగస్టు 14, (తెలంగాణ వాణి ప్రతినిధి)**
వనపర్తి జిల్లా కేంద్రంలోని సాయి నగర్ కాలనీలో మాస్టర్ మైండ్ హై స్కూల్‌లో ఆదివారం టైక్వాండో మార్షల్ ఆర్ట్స్ బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలను మాస్టర్ రవి కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ పరీక్షల్లో పాల్గొన్న విద్యార్థులు, విద్యార్థినీలు ప్రతిభ కనబరిచి ఉత్తీర్ణులయ్యారు. కార్యక్రమం అనంతరం విజేతలకు బెల్ట్ గ్రేడింగ్ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ టైక్వాండో వంటి మార్షల్ ఆర్ట్స్ శారీరక దృఢత్వాన్ని పెంపొందించడంతో పాటు మానసిక ధైర్యాన్ని పెంచుతాయని తెలిపారు. ప్రస్తుత సమాజంలో ముఖ్యంగా ఆడపిల్లలకు స్వీయరక్షణ (సెల్ఫ్ డిఫెన్స్) అత్యంత అవసరమని పేర్కొన్నారు. పాఠశాల కరెస్పాండెంట్ గౌతమ్ కుమార్ మాట్లాడుతూ, చదువుతో పాటు శారీరక వ్యాయామం, మెదడు చురుకుదనం కూడా విద్యార్థుల సమగ్రాభివృద్ధికి అవసరమని తెలిపారు. ఆరోగ్యవంతమైన విద్యార్థులే భవిష్యత్తులో అన్ని రంగాల్లో రాణించగలరని చెప్పారు. బాలికలకు స్వీయరక్షణలో ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. పాఠశాల స్థాయిలోనే ఇలాంటి శిక్షణ అందించడం అభినందనీయమని తల్లిదండ్రులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కోచ్ బుద్ధారం రవికుమార్, జూనియర్ కోచ్ శివలీల, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## శాయంపేటలో కరీంనగర్ డైరీ పాల సేకరణ భవన ప్రారంభోత్సవం

**జమ్మికుంట, ఆగస్టు 14,(తెలంగాణ వాణి ప్రతినిధి):**
శాయంపేట గ్రామంలో నూతనంగా నిర్మించిన కరీంనగర్ డెయిరీ పాల సేకరణ కేంద్ర భవనాన్ని శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి కరీంనగర్ డెయిరీ చైర్మన్ చెలిమెడ రాజేశ్వర్ రావు హాజరై భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా శాయంపేట కరీంనగర్ డెయిరీ పాల సేకరణ సంస్థ అధ్యక్షుడు మడికొండ నర్సింగరావు, గ్రామ సర్పంచ్ మడికొండ సురేందర్ రావు, ఉపసర్పంచ్ ఉదయశ్రీ, గ్రామ పాలకవర్గ సభ్యులు ప్రత్యేకంగా పాల్గొని మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాష్ట్రంలో స్వచ్ఛమైన నాణ్యమైన పాలను అందిస్తుంది కరీంనగర్ డైరీ మాత్రమే అని వారు పేర్కొన్నారు. పాడి పరిశ్రమను ప్రోత్సహించేందుకు కరీంనగర్ డైరీ రైతులకు అండగా ఉంటుందని ముఖ్యంగా రైతులు గేదెలను పెంచి నాణ్యమైన పాలను ఉత్పత్తి చేయాలని వారికి సూచించారు. ప్రస్తుతం శాయంపేట లో రోజుకు సుమారు 200 లీటర్ల పాలు అందుబాటులోకి వస్తున్నాయని వాటిని కనీసం 1000 లీటర్లకు వచ్చే విధంగా రైతులు చర్యలు చేపట్టాలని మీకు కావాలంటే గేదలు కొనుగోలు చేయడానికి ఆర్థిక చేయూతను అందిస్తామని అంతేకాకుండా ప్రమాదవశాత్తు గేదలు మరణిస్తే



ఇన్సూరెన్స్ ద్వారా డబ్బులు వచ్చే విధంగా ఏర్పాటు చేస్తామని వారు సూచించారు. ప్రభుత్వం పాడి పరిశ్రమను ప్రోత్సహించడానికి సిద్ధంగా ఉందని ప్రజలకు నాణ్యమైన పాలు దొరకక నాణ్యతలేని పాలను తాగుతున్నారని కరీంనగర్ డైరీ ద్వారా స్వచ్ఛమైన పాలను అందించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డెయిరీ బోర్డు డైరెక్టర్లు అంతం రమాదేవి, పెద్దిరెడ్డి తిరుపతి రెడ్డి,జమ్మికుంట ఎం సి సి మేనేజర్ ముస్కు అంజిరెడ్డి, అసిస్టెంట్ మేనేజర్ పొన్నగంటి రాజేందర్, సూపర్‌వైజర్లు పి. మహేందర్, కె .రవీందర్, వెటర్నరీ అసిస్టెంట్ శ్రీకాంత్ తదితరుల పాల్గొన్నారు.

## గౌరవెల్లి పాఠశాలలో స్వచ్ఛత పక్షవాడ కార్యక్రమం




**హుస్నాబాద్, ఆగస్టు 14 (తెలంగాణ వాణి ఆర్‌సి):**
సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం గౌరవెల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మేరా యువభారత్ (మైభారత్) ఆధ్వర్యంలోని సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ నేతృత్వంలో స్వచ్ఛత పక్షవాడ కార్యక్రమం నిర్వహించారు. ఆగస్టు 1 నుంచి 15 వరకు నిర్వహిస్తున్న జిల్లా స్థాయి కార్యక్రమాల్లో భాగంగా విద్యార్థులతో స్వచ్ఛభారత్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు వలస సుభాష్ మాట్లాడుతూ పరిశుభ్రమైన భారతదేశ నిర్మాణం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. స్వచ్ఛమైన పరిసరాలు ఆరోగ్యకరమైన సమాజానికి, దేశ అభివృద్ధికి ఎంతో అవసరమని పేర్కొన్నారు. విద్యార్థులు స్వచ్ఛతపై అవగాహన పెంచుకుని ఇతరులకు స్ఫూర్తిగా నిలవాలని సూచించారు. అనంతరం పదో తరగతిలో జిల్లా స్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఏ. జ్యోతిని శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఏ. జ్యోతి, ఫిజికల్ డైరెక్టర్ జంగపల్లి వెంకటనర్సయ్య, రామన్ బాబు, శ్రీనివాస్, కృష్ణకుమారి,నాశ్రీన్, రమాదేవి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## వీధి వ్యాపారులపై ఆర్థిక భారం తగ్గించేలా

**జమ్మికుంట మున్సిపల్ కౌన్సిల్ నిర్ణయం**

**జమ్మికుంట, ఆగస్టు 14,(తెలంగాణ వాణి ప్రతినిధి):**
వీధి వ్యాపారులపై ఆర్థిక భారం తగ్గించేందుకు జమ్మికుంట మున్సిపల్ కౌన్సిల్ కీలక నిర్ణయం తీసుకుంది. మున్సిపాలిటీ అందిస్తున్న పారిశుద్ధ్య, చెత్త సేకరణ తదితర ప్రజా సేవలకు సంబంధించి వసూలు చేసే యూజర్ చార్జీలను గణనీయంగా తగ్గిస్తూ నిర్ణయం తీసుకుంది. తొలుత వీధి వ్యాపారుల నుంచి రోజుకు రూ.100, నెలకు రూ.3,000, సంవత్సరానికి రూ.36,000 చొప్పున యూజర్ చార్జీలు వసూలు చేయాలనే ప్రతిపాదన ఉండగా, వారి ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్, కౌన్సిల్ సభ్యులు, మున్సిపల్ కమిషనర్, సంబంధిత శానిటేషన్ సిబ్బంది పరస్పరం చర్చించారు.వీధి వ్యాపారులపై భారం పడకుండా యూజర్ చార్జీలను భారీగా తగ్గిస్తూ రోజుకు రూ.11 చొప్పున, సంవత్సరానికి రూ.4,800 మాత్రమే వసూలు చేయాలని కౌన్సిల్ నిర్ణయించింది. ఈ నిర్ణయం వీధి వ్యాపారులకు ఉపశమనం కలిగించడంతో పాటు, మున్సిపాలిటీ అందించే పారిశుద్ధ్య సేవలకు వారి సహకారాన్ని మరింత పెంచుతుందని అధికారులు తెలిపారు.
ప్రతి చెల్లింపుకూ అధికారిక రసీదువీధి వ్యాపారులు చెల్లించే ప్రతి రూపాయికి మున్సిపాలిటీ తరఫున అధికారిక రసీదు తప్పనిసరిగా అందజేయనున్నట్లు తెలిపారు. యూజర్ చార్జీల వసూళ్లు పూర్తిగా పారదర్శకంగా, అధికారిక రసీదుల ద్వారానే నిర్వహించనున్నట్లు స్పష్టం చేశారు. వీధి వ్యాపారులు మున్సిపాలిటీ అందిస్తున్న పారిశుద్ధ్య, చెత్త సేకరణ, ఇతర ప్రజా సేవలకు సహకరిస్తూ నిర్ణయించిన



యూజర్ చార్జీలను సక్రమంగా చెల్లించాలని కోరారు. తమ వ్యాపార ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుతూ జమ్మికుంట పట్టణ పారిశుద్ధ్యం, పరిశుభ్రత, అభివృద్ధిలో భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు.“వీధి వ్యాపారుల అభివృద్ధి –– మున్సిపల్ అభివృద్ధిలో భాగస్వామ్యం” అనే లక్ష్యంతో కౌన్సిల్ ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. వీధి వ్యాపారుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని తీసుకున్న ఈ నిర్ణయానికి ప్రజలు, వ్యాపారులు సహకరించాలని, మున్సిపాలిటీతో సమన్వయంతో జమ్మికుంట పట్టణాన్ని మరింత పరిశుభ్రమైన, సుందరమైన, అభివృద్ధి చెందిన పట్టణంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్, మున్సిపల్ కమిషనర్ కోరారు.

## బీర్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో 50 ల కేజీల బియ్యం సాయం

**రాజపేట ఆగస్టు:14(తెలంగాణ వాణి విలేకరి)**
యాదాద్రి భువనగిరి జిల్లా రాజపేట మండల కేంద్రంలో సింగారం గ్రామంలో అనారోగ్యంతో మరణించిన బొల్లు బుచ్చమ్మ, సింగరి పోచమ్మ గ్రామంలో ఇద్దరూ ఒకేసారి అనారోగ్యంతో మరణించారు. వీరి కుటుంబాలకు బీర్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో వెహికల్ సాయం అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు రాళ్ల నరేష్ మన్య శ్రీను కర్ల మల్లారెడ్డి పారుపల్లి రామ్ రెడ్డి ధ్యాప వెంకటయ్య ధ్యాప నరసింహులు కటికల బాల నరసయ్య ఆకుల బాలమల్లు మేడమైన శంకర్ గుర్రాల రాజు ఆకుల కనకయ్య లగడబోయిన రాజు వనం ఐలయ్య బొల్లారం స్వామి కరుణాకర్ ధ్యాపరాజు చాప నర్సింలు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు గ్రామస్తులు



పాల్గొన్నారు. అదేవిధంగా బొల్లు బుచ్చమ్మ కార్యక్రమంలో మేరమైన నవీన్ చాప నర్సింలు గ్రామంలోని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు గ్రామస్తులు పాల్గొన్నారు.

## మైనారిటీ కో ఆప్షన్ సభ్యురాలిగా గ్లోరినా ఎన్నిక




**హుస్నాబాద్ ఆగస్టు 14(తెలంగాణ వాణి ఆర్ సి)**
సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మున్సిపల్ మైనారిటీ కోఆప్షన్ (క్రిస్టియన్) సభ్యురాలిగా కాతా అలియాస్ మారుపాక గ్లోరినా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో చైర్‌పర్సన్ దండి లక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య ప్రత్యేక సమావేశంలో 14 మంది కాంగ్రెస్ కౌన్సిలర్ల మద్దతుతో ఆమె ఎన్నికైనట్లు మున్సిపల్ కమిషనర్ టి. మల్లికార్జున్ ప్రకటించారు.గత మే నెలలో మొత్తం నలుగురు కోఆప్షన్ సభ్యులకుగాను ముగ్గురిని ఎన్నుకోగా.. ఒక మైనారిటీ కోఆప్షన్ సభ్యుడి ఎన్నిక వాయిదా పడింది. కౌన్సిలర్ల ఏకాభిప్రాయంతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో కాతా గ్లోరినాను మైనారిటీ కోఆప్షన్ సభ్యురాలిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.తన ఎన్నికకు సహకరించి మద్దతుతెలిపినమున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్ పర్సన్, కౌన్సిలర్లు, మంత్రి పొన్నంప్రభాకర్ ,హుస్నాబాద్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వడ్డేపల్లి వెంకటరమణ కు గ్లోరినా కృతజ్ఞతలు తెలిపారు. మున్సిపల్ పాలకవర్గ సభ్యులతో కలిసి మైనారిటీల సంక్షేమానికి తనవంతు కృషి చేస్తానన్నారు.ఈ కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ చిత్తారి పద్మ రవీందర్, కౌన్సిలర్లు చెన్నబోయిన అనూష, బూరుగులత, పిల్లి తిరుపతి, బొలిశెట్టి రాజు, భూక్య సంపత్ నాయక్, గడిపే సతీష్‌కుమార్, సావుల మంజుల, పూదరి వరప్రసాద్, కేశవేణి రమేష్, బొల్లి శ్రీనివాస్, వైద్యం కిరణ్ ప్రసాద్, గాదెపాక రవీందర్, వాల సుప్రజ, బత్తుల స్వరూప, కోఆప్షన్ సభ్యులు ఎండీ హసన్, భూక్య సరోజన, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.



## విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడమే లక్ష్యం

- వెలిమెల ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు క్రీడా దుస్తుల పంపిణీ
- స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాజ్‌కుమార్ ఫౌండేషన్ సేవా కార్యక్రమం
- 60 మంది విద్యార్థులకు అందజేత

**పటాన్ చెరు, ఆగస్టు 14 (తెలంగాణ వాణి):**
విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడంతో పాటు, వారి ప్రతిభను వెలికితీసేందుకు అవసరమైన ప్రోత్సాహం, సహకారం అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని రాజ్‌కుమార్ అన్నారు.స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని రాజ్‌కుమార్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వెలిమెల ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు క్రీడా దుస్తుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కాల్వగడ్డ రాజ్‌కుమార్ 60 మంది విద్యార్థులకు క్రీడా దుస్తులను అందజేశారు.ఈ సందర్భంగా క్రీడలు విద్యార్థుల శారీరక దారుఢ్యంతో పాటు మానసిక వికాసానికి ఎంతో దోహద పడతాయని రాజ్‌కుమార్ పేర్కొన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికి తీసేందుకు తన వంతు సహకారం అంది స్తానని తెలిపారు. విద్యార్థులకు క్రీడా దుస్తులు అందించిన రాజ్‌కుమార్ ఫౌండేషన్ చైర్మన్ కాల్వగడ్డ రాజ్‌కుమార్‌కు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

## రైల్వే భూముల పేరుతో నోటీసులు ఇవ్వడం సరికాదు

- తరతరాలుగా నివాసం ఉంటున్నాం.. తగిన సమయం ఇవ్వాలి
- అదనపు డివిజనల్ రైల్వే మేనేజర్‌కు బండలగూడ నివాసితుల వినతి



**పటాన్‌చెరు, ఆగస్టు 14 (తెలంగాణ వాణి):**
రామచంద్రాపురం రైల్వే పరిధిలోని బండలగూడలో సుమారు 50 ఏళ్లుగా నివాసం ఉంటున్న తమకు ఇళ్లు ఖాళీ చేయాలని రైల్వే శాఖ నోటీసులు జారీ చేయడం సరికాదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు.రామచంద్రాపురం మాజీ ఎంపీపీ నలకంటి యాదగిరి యాదవ్ ఆధ్వర్యంలో బండలగూడ నివాసితులు గురువారం అదనపు డివిజనల్ రైల్వే మేనేజర్‌ను కలిసి తమ సమస్యలను వివరించారు. తమ పూర్వీకుల కాలం నుంచి ఇక్కడే నివసిస్తున్నామని, ప్రతి ఏటా ప్రభుత్వానికి పన్నులు చెల్లిస్తున్నామని తెలిపారు. గ్రామంలో ప్రభుత్వ ఆధ్వర్యంలో మౌలిక వసతులు కూడా కల్పించారని పేర్కొన్నారు. ఇటీవల రైల్వే భూముల్లో ఇళ్లు నిర్మించుకున్నారంటూ ఖాళీ చేయాలని నోటీసులు ఇవ్వడం తమను ఆందోళనకు గురిచేసిందన్నారు. తమ వాదనను, పత్రాలను సమర్పించేందుకు తగిన సమయం ఇవ్వాలని రైల్వే అధికారులను కోరారు. సమస్యను మానవతా దృక్పథంతో పరిశీలించి తగిన పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో చంద్ర శేఖర్, విక్రమ్, శ్రీరాములు, దశరథ్, బండలగూడ నిర్వాసితులు పాల్గొన్నారు.

## ఎస్ఎస్సీ బ్యాచ్ మిత్రుల ఆపన్నహస్తం



**నారాయణఖేడ్: ఆగస్టు 14 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
ఎస్ఎస్సీ బ్యాచ్ మిత్రుడు రుద్రూరు సాయిలు గారి మాతృమూర్తి పరమపదించడంతో, ఆయన కుటుంబాన్ని పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేసిన ఎస్–ఎస్సీ బ్యాచ్ మిత్రులు ఆ కుటుంబానికి ఆర్థిక చేయూతను అందించారు.కష్ట సమయంలో సాయిలు కుటుంబానికి అండగా నిలిచి, తమ స్నేహబంధాన్ని చాటుకున్న మిత్రుల సేవాభావాన్ని పలువురు అభినందించారు. ఈ సందర్భంగా మృతురాలి ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డా, ఆంజనేయులు, కొంసాని దత్తారెడ్డి, బంజ నగేష్, మంగల్పేట్ సాయిలు, కమ్మరి రమేష్, సిహెచ్ రమేష్, తదితర మిత్రులు పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



**నాగిరెడ్డిపేట మండలం ఆగస్టు 14:( తెలంగాణ వాణి ప్రతినిధి)**
నాగిరెడ్డిపేట మండలంలోని నాగిరెడ్డి పేట గ్రామంలో శుక్రవారం రోజున సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ చేశారు . ఇందులో భాగంగా రూ.18,500/– చెక్కును లబ్ధిదారురాలు మన్నె సుజాతకు కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు ఆదేశాల మేరకు అందజేశారు . ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ..... మదన్ అన్నకు సీఎం రేవంత్ రెడ్డికి ఎల్లవేళలా రుణపడి ఉంటామని తెలిపారు . ఇట్టి కార్యక్రమంలో భాగంగా గ్రామ సర్పంచ్ మన్నె వెంకటి , గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బోయిన హనుమాన్లు , కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు .

## ఇంటర్నేషనల్ ట్రాక్డ్ ప్యాకెట్ సేవలను సద్వినియోగం చేసుకోండి

### జమ్మికుంట ఇన్‌చార్జి పోస్టుమాస్టర్ యు. మహేందర్



**జమ్మికుంట, ఆగస్టు 14 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
విదేశాల్లో నివసిస్తున్న బంధువులకు రాఖీలు, బహుమతులు, పూజా సామగ్రి, ఇతర వస్తువులు పంపించేందుకు భారత తపాలా శాఖ అందిస్తున్న లిఇంటర్నేషనల్ ట్రాక్డ్ ప్యాకెట్ సర్వీస్ (ఐటీపీఎస్)లిను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జమ్మికుంట ఇన్‌చార్జి పోస్టుమాస్టర్ యు. మహేందర్ కోరారు.రాఖీ పౌర్ణమి సందర్భంగా విదేశాల్లోని అన్నదమ్ములకు రాఖీలు పంపించేందుకు ఈ సేవ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. చిన్న పరిశ్రమలు, ఈ–కామర్స్ వ్యాపారులు విదేశాలకు చిన్న పార్సిళ్లు పంపించేందుకు కూడా ఐటీపీఎస్‌ను వినియోగించుకోవచ్చన్నారు.ఈ సేవ ద్వారా 2 కిలోల వరకు బరువున్న అనుమతించబడిన వస్తువులను ఎండ్–టు–ఎండ్ ట్రాకింగ్ సదుపాయంతో 192 దేశాలకు పంపించవచ్చని తెలిపారు. 250 గ్రాముల వరకు ప్యాకెట్‌కు రూ.560, పన్నులతో కలిపి రూ.660, పార్సిల్‌కు రూ.1,000, పన్నులతో కలిపి రూ.1,180 చార్జీ ఉంటుందని వివరించారు. సాధారణంగా 7 నుంచి 15 రోజుల్లో వస్తువులు గమ్యస్థానానికి చేరే అవకాశం ఉందన్నారు. విద్య, ఉద్యోగ, వ్యాపార, ఆస్తి సంబంధిత పత్రాల కోసం ఇంటర్నేషనల్ రిజిస్టర్డ్ లెటర్, ఈఎంఎస్ సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రజలు తపాలా శాఖ అందిస్తున్న అంతర్జాతీయ సేవలను సద్వినియోగం చేసుకోవాలని మహేందర్ విజ్ఞప్తి చేశారు.

## రేపు జగిత్యాల జిల్లాకు మంత్రి అజారుద్దీన్



**జగిత్యాల: ఆగస్టు 14 (తెలంగాణ వాణి ప్రతినిధి )**
భారత స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆగస్టు 15వ తేదీ శనివారం జగిత్యాల జిల్లా కేంద్రంలో నిర్వహించే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు రాష్ట్ర మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ హాజరుకానున్నారు. ఉదయం 9.30 గంటలకు జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ ముఖ్య అతిథిగా పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు. అనంతరం పోలీస్ కవాతు ను తిలకించి, స్వాతంత్ర్య దినోత్సవ సందేశం ఇవ్వనున్నారు. వేడుకలకు జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, పోలీసులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, ప్రజలు హాజరుకానున్నారు.

## మెరుగైన పాలన అందించేందుకు గ్రామ పంచాయతీ భవనం

### ఎమ్మెల్యే సంజయ్ కుమార్



**జగిత్యాల: ఆగస్టు 14 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
జగిత్యాల రూరల్ మండలం వంజరపల్లి గ్రామంలో రూ.20 లక్షల నిధులతో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు మెరుగైన పరిపాలనా సేవలు అందించేందుకు పంచాయతీ భవనం ఉపయోగపడుతుందని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షులు గాజంగి నందయ్య, సర్పంచ్ అదరవేని గంగమల్లయ్య, ఉప సర్పంచ్ బొల్లె తిరుపతి భీమవ్వ, ఏఎంసీ చైర్మన్ గడ్డం నారాయణరెడ్డి, ఎంపీడీవో రమాదేవి, ఎంఆర్వో హకీం, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బాల ముకుందం, మాజీ పీఏసీఎస్ చైర్మన్ సదాశివరావు, మాజీ ఏఎంసీ చైర్మన్ నక్కల రవీందర్‌రెడ్డి, సర్పంచుల ఫోరం అధ్యక్షులు కట్ట రాజేందర్, మాజీ ఎంపీపీ మహేశ్, సర్పంచులు ప్రకాశ్, వంశీ, మాజీ సర్పంచ్ మల్లారెడ్డి, కుడుకుల లక్ష్మణ్, అంకం సతీశ్, నరేశ్, గంగారం, డీసీసీ ఉపాధ్యక్షులు డీలర్ రవి, నరేశ్, మండల యూత్ అధ్యక్షులు భూమారెడ్డి, నాయకులు తిరుపతి, ఏఎంసీ డైరెక్టర్ శ్రీకాంత్, మాజీ ఎంపీటీసీ శంకర్‌తో పాటు అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో ఘనంగా తిరంగా ర్యాలీ.



**ఇబ్రహీంపట్నం ఆగస్టు 14 (తెలంగాణ వాణి విలేకరి)**
భారతీయ జనతా పార్టీ రాష్ట్ర శాఖ పిలుపుమేరకు నిర్వహిస్తున్న హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగాజగిత్యాలజిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో ఘనంగా తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఇబ్రహీంపట్నం ఇందిర గాంధీ చౌరస్తా నుండి కొత్త బస్టాండ్,పాత బస్టాండ్ వరకు నిర్వహించారు.జాతీయ జెండాను చేతబూని నిర్వహించిన ఈ తిరంగా ర్యాలీ దేశభక్తి, జాతీయ ఐక్యతకు ప్రతీకగా నిలిచింది. భారతమాతకు జై, వందేమాతరం నినాదాలతో ఇబ్రహీంపట్నం మండల కేంద్రం మార్మోగింది.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తి భావాన్ని చాటాలని, హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని ప్రజలందరూ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య సమరయోధులత్యాగాలను స్మరించుకుంటూ దేశ సమగ్రత, ఐక్యత కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శులు సుంచు రణధీర్, పంతంగి వెంకటేష్ యాదవ్, జిల్లా నాయకులు తీగల శ్రీధర్ రెడ్డి,గడ్డం సంజీవ్ రెడ్డి మండల ఉపాధ్యక్షులు దేవన్న,సతీష్,ఎస్సీ మోర్చా మండల అధ్యక్షులు సురేష్, ఎండోమెంట్ సెల్ కో కన్వీనర్ చిట్యాల నరేందర్,శక్తి కేంద్రం ఇంచార్జ్ నరేష్ బూత్ అధ్యక్షులు మారుతీ, కిరణ్,నాయకులు మహేందర్,శశి,కిశోర్, నిఖిల్ కార్యకర్తలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వావిలాలలో ఘనంగా 'హర్ ఘర్ తిరంగా' ర్యాలీ

**- జాతీయ సమైక్యతకు ఇవే నిదర్శనం: బిజెపి కన్వీనర్ మద్దూరి రాజు**



**పటాన్ చెరు, ఆగస్టు 14, (తెలంగాణ వాణి):**
గడ్డ పోతారం మున్సిపాలిటీ పరిధిలోని వావిలాల గ్రామంలో బిజెపి కన్వీనర్, అధ్యక్షులు మద్దూరి రాజు ఆధ్వర్యంలో 'హర్ ఘర్ తిరంగా' ర్యాలీ ఘనంగా జరిగింది. నాయకులు, విద్యార్థులు త్రివర్ణ పతాకాలు చేతబూని భారత్ మాతా కీ జై… నినాదాలతో వీధుల గుండా ఉత్సాహంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మద్దూరి రాజు మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో దేశభక్తిని, జాతీయ సమైక్యతను చాటి చెప్పేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు నల్లగండ్ల అశోక్ కుమార్, వడ్ల సత్యనారాయణ, బూత్ అధ్యక్షులు అగ్రారం వెంకటేష్, ఓం కార్, శివ, రమణసింగ్, రాజు, జడ్పీ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గీతం 'సెలెస్టియా 2026'తో ఫ్రెషర్స్ కు స్వాగతం

### స్కూల్ ఆఫ్ టెక్నాలజీలో స్నేహభావంతో నిండిన ఉత్సాహభరితమైన వేడుక



**పటాన్ చెరు, ఆగస్టు 14 (తెలంగాణ వాణి)**
హైదరాబాదు లోని గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ, ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'సెలెస్టియా 2026' ఫ్రెషర్స్ పార్టీని ఆగస్టు 14న నిర్వహించింది. సంగీతం, నృత్యం, వినోదం, స్నేహభావంతో నిండిన ఉత్సాహ భరితమైన వేడుకతో 2026–27 బ్యాచ్ ఇంజనీరింగ్ విద్యార్థులను ఈ వేడుకతో స్వాగతం పలికింది. ఈ కార్యక్రమం ఫ్రెషర్స్ కు తమ సీనియర్లు, సహచరులతో కలిసి మాట్లాడటానికి, కొత్త స్నేహాలను పెంచు కోవడానికి, గీతం కమ్యూనిటీలో భాగం కావడానికి ఒక ఉత్సాహ భరితమైన వేదికను అందించింది. ఉత్సాహ భరితమైన సాంస్కృతిక ప్రదర్శనలు, ఆసక్తికరమైన ఆటలు, సంగీతం, అనేక సరదా కార్యకలాపాలతో ప్రాంగణం కళకళలాడుతూ, పండుగ వాతావరణాన్ని సృష్టించింది. ఈ వేడుకలో ప్రత్యేక ఆకర్షణగా గ్లామరస్ ర్యాంప్ వాక్. ఇక్కడ ఫ్రెషర్స్ తమ ఆత్మవిశ్వాసం, హుందాతనం, వ్యక్తిత్వం, శైలిని



ప్రదర్శించారు. వారి ఉత్సాహభరితమైన భాగస్వామ్యం, ఉత్తేజకరమైన ప్రదర్శనలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. గీతం నాయకుల చేతుల మీదుగా మిస్టర్ ఫ్రెషర్, మిస్ ఫ్రెషర్లకు సత్కారం చేయడంతో, ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న ఈ వేడుకలు ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ నాయకత్వం మాట్లాడుతూ, కొత్త విద్యార్థుల కోసం ఆసక్తికరమైన, స్వాగత పూర్వకమైన వేదికను ఏర్పాటు చేసినందుకు విద్యార్థి నిర్వాహకుల కృషిని అభినందించారు. 'సెలెస్టియా 2026' ఫ్రెషర్లకు తమ ప్రతిభను ప్రదర్శించే అవకాశాన్ని కల్పించడమే కాకుండా, వారిలో జట్టు స్ఫూర్తిని, స్నేహాన్ని, ఆత్మ విశ్వాసాన్ని, గీతం సమాజం పట్ల బలమైన అనుబంధ భావాన్ని పెంపొందించిందని వారు పేర్కొన్నారు. గీతంలో తమ విద్యా ప్రయాణానికి ఒక చిరస్మరణీయమైన ఆరంభాన్ని అందించినందుకు ఫ్రెషర్లు తమ సీనియర్లకు, నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలియజేయడంతో ఈ వేడుకలు ఆనందంగా ముగిశాయి.

## పటాన్ చెరులో ఘనంగా గూడెం విష్ణువర్ధన్ రెడ్డి జయంతి వేడుకలు

- **250 మందికి పైగా యువకుల రక్తదానం**
- **ఉచిత వైద్య శిబిరం, అన్నదానం, రోగులకు పండ్ల పంపిణీ**
- **భారీ సంఖ్యలో పాల్గొన్న జిఎంఆర్, జివిఆర్ యువసేన సభ్యులు**
- **గూడెం విష్ణువర్ధన్ రెడ్డి సేవలను స్మరించుకున్న నాయకులు**



**పటాన్ చెరు, ఆగస్టు 14, (తెలంగాణ వాణి)**
స్థానిక శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి పెద్ద కుమారుడు కీర్తిశేషులు గూడెం విష్ణువర్ధన్ రెడ్డి 37వ జయంతి వేడుకలను జిఎంఆర్, జివిఆర్ అభిమానులు, స్నేహితులు ఘనంగా నిర్వహించారు. సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ విష్ణువర్ధన్ రెడ్డి జ్ఞాపకాలను స్మరించుకున్నారు.జయంతి సందర్భంగా పటాన్ చెరు పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో జిఎంఆర్ యువసేన, జివిఆర్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భారీ రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 250 మందికి పైగా యువకులు రక్తదానం చేసి తమ మానవతా దృక్పథాన్ని చాటుకున్నారు. రక్తదాన శిబిరాన్ని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి ఆర్ఎంఓ శ్రీనివాస్ పర్యవేక్షించారు.అదే విధంగా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు పంపిణీ చేశారు. నిరుపేద ప్రజలకు



అన్నదానం నిర్వహించారు. బ్లాక్ ఆఫీస్, షాపింగ్ కాంప్లెక్స్ ఆవరణలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వైద్య సలహాలు అందించారు. అనంతరం అభిమానులు, సన్నిహితులు, యువసేన సభ్యుల సమక్షంలో కేక్ కట్ చేసి గూడెం విష్ణువర్ధన్ రెడ్డి జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడుతూ.. గూడెం విష్ణువర్ధన్ రెడ్డి తండ్రికి తగ్గ తనయుడిగా ఎదుగుతున్న క్రమంలో అకాల మరణం చెందడం అత్యంత బాధాకరమని అన్నారు. ప్రజా సేవ పట్ల ఆయనకున్న ఆసక్తి, స్నేహశీలత, సేవా భావం అందరికీ ఆదర్శమని పేర్కొన్నారు. విష్ణువర్ధన్ రెడ్డి ఆశయాలు, ఆదర్శాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఆయన జ్ఞాపకార్థం నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు సమాజానికి ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి, యాదగిరి యాదవ్, విజయ్ కుమార్, నర్రా బిక్షపతి, రామచంద్రారెడ్డి, పృథ్వీరాజ్, గూడెం సంతోష్ రెడ్డి, గూడెం సందీప్ రెడ్డి, అశోక్, వెంకటేష్, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పంట మార్పిడే.. రైతుకు రాచబాట : కలెక్టర్ చిత్రా మిశ్రా

- **ఆరుతడి పంటలతో అధిక లాభాలు**
- **రైతులు ఆ దిశగా ప్రత్యేక దృష్టి సారించాలి**



**కరీంనగర్, ఆగస్టు 14 (తెలంగాణ వాణి ప్రతినిది)**
కరీంనగర్ జిల్లాలో రైతులు తక్కువ నీటితో సాగయ్యే ఆరుతడి,ప్రత్యామ్నాయ పంటల సాగుపై మరింత దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా సూచిం చారు.పంటల మార్పిడితో నేల సారాన్ని కాపాడుకోవ దంతో పాటు పెట్టుబడిని తగ్గించుకుని అధిక లాభా లు పొందే అవకాశం ఉంటుందని ఆమె పేర్కొ న్నారు.శుక్రవారం ప్రత్యా మ్నాయ పంటల సాగు రైతుల సన్నద్ధత పై వ్యవసా య అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఆరుతడి పంటల సాగు రైతులకు అవగాహన కార్యక్రమాలు జిల్లాలో చేపట్టవలసిన కార్యాచరణ ప్రణాళికపై పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆగస్టు 16 నుంచి 31వ తేదీ వరకు మొక్కజొన్న,ఉలవలు, అలసంద,పొద్దుతిరుగుడు, నువ్వులు,కూరగాయలు తదితర ఆరుతడి పంటల ను సాగు చేసుకునేందుకు అనువైన సమయమని కలెక్టర్ తెలిపారు.రైతులు ఈ అవకాశాన్ని సద్వినియో గం చేసుకుని తక్కువ నీటితో సాగయ్యే పంటల వైపు మొగ్గు చూపాలని సూచించారు.అదేవిధంగా రైతులు ఆయిల్ ఫామ్ సాగుపై కూడా దృష్టి సారించాలని పేర్కొన్నారు. గత ఏడాది జిల్లాలో 6,130 ఎకరాల్లో ఆరుతడి పంటలు సాగు కాగా,ఈ వానాకాలం లో ఇప్పటివరకు 19,135 ఎకరాల్లో ఆరుతడి పంటలు సాగు చేయడం శుభపరిణా మమని కలెక్టర్ అన్నారు. గతంతో పోలిస్తే దాదాపు మూడు రెట్లు అధికంగా రైతులు ఆరుతడి పంటల సాగుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు.
"ఆరుతడి పంటల సాగు విస్తీర్ణాన్ని మరింత పెంచాలి. రైతులు ఒకే పంటపై ఆధారపడకుండా పంట మార్పిడిని అలవాటు చేసుకోవాలి.తక్కువ నీరు, తక్కువ పెట్టుబడితో మంచి దిగుబడి,అధిక ఆదాయం వచ్చే పంటలను ఎంపిక చేసుకోవాలి" అని కలెక్టర్ సూచించారు.వ్యవసాయ అధికారులు గ్రామాల వారీగా రైతులకు అవగాహన కల్పించి, ఆరుతడి మరియు ప్రత్యామ్నాయ పంటల సాగు వల్ల కలిగే ప్రయోజనాలను వివరించాలని ఆమె ఆదేశించారు.రైతులకు నేల స్వభావం,నీటి లభ్యత, పంటల సాగు సమయం, మార్కెట్ అవకాశాలపై శాస్త్రీయ అవగాహన కల్పించాలని సూచించారు.
సెప్టెంబర్ 1 నుంచి 31 వరకు ఎర్లీ రబీ సీజన్‌లో భాగంగా వేరుశనగ,పొద్దుతిరుగుడు, మొక్కజొన్న వంటి పంటలను కూడా రైతులు అధికంగా సాగు చేసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు.రాబోయే రబీ సీజన్‌ను దృష్టిలో పెట్టుకుని రైతులు ముందుగానే పంటల ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు."పంట మార్పిడి రైతుకు రాచబాట. ఒకే పంటను పదేపదే సాగు చేయడం కంటే విభిన్న పంటలను సాగు చేయడం ద్వారా నేల సారాన్ని కాపాడుకోవచ్చు.నీటి వినియోగాన్ని తగ్గించడంతో పాటు పంట నష్టాల ప్రమాదాన్ని కూడా తగ్గించుకోవచ్చు. రైతుల ఆదాయం పెరగాలంటే వ్యవసాయంలో పంటల వైవిధ్యం ఎంతో అవసరం" అని కలెక్టర్ చిత్రా మిశ్రా అన్నారు. జిల్లాలో ఆరుతడి పంటల సాగుపై రైతుల్లో మరింత చైతన్యం తీసుకురావాలని, ప్రతి గ్రామంలో వ్యవసాయ అధికారులు రైతులతో సమావేశాలు నిర్వహించాలని ఆమె ఆదేశించారు.రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటిస్తూ అందుబాటులో ఉన్న నీటిని సమర్థంగా వినియోగించుకుని అధిక లాభాలు అందించే పంటల సాగుకు ముందుకు రావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

## పెద్ద శంకరంపేటలో తిరంగా ర్యాలీ



**పటాన్ చెరు,/పెద్ద శంకరంపేట, ఆగస్టు 14( తెలంగాణ వాణి),:**
మండల కేంద్రమైన పెద్ద శంకరం పేట లో శుక్రవారం భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో జాతీయ జెండాలు చేత పట్టుకొని పట్టణ పురవీధు ల గుండా తిరంగా ర్యాలీ నిర్వహించారు హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా పెద్ద శంకరంపేట లో గాంధీ చౌరస్తా అంబేద్కర్ చౌరస్తా న్యూ బస్టాండ్ ల మీదుగా విద్యార్థులు 100 మీటర్ల జాతీయ జెండాను పట్టణ పుర వీధుల మీద ఊరేగించారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా ఓబీసీ అధ్యక్షుడు కోణం విఠల్. మండల బిజెపి అధ్యక్షుడు శ్రావణ్ కుమార్. ప్రధాన కార్యదర్శి ఎం కృష్ణ.బిజే వైఎం అధ్యక్షులు బుగుడాల కృష్ణ.. బిజెపి నాయకులు అనిల్. సురేష్, సంస్కార్ విద్యాలయ కరస్పాండెంట్ సీతారామారావు, అంజయ్య సుకుమారు. ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు

## పెరిగిన ఎరువుల ధరలతో రైతాంగం ఆగమాగం

**రిజర్వాయర్ నీటితో పంటలకు నీరందించాలి: సీపీఎం**



**కొమురవెల్లి, ఆగస్టు 14 (తెలంగాణ వాణి):**
వర్షాభావ పరిస్థితులతో పాటు ఎరువుల ధరలు పెరగడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సీపీఎం సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి అన్నారు. శుక్రవారం కొమురవెల్లిలోని సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. వరి సాగుకు నార్లు పోసి రెండు నెలలు గడుస్తున్నా వర్షాలు లేక నాట్లు వేయలేక రైతులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. సమీపంలోని తపాస్‌పల్లి రిజర్వాయర్ నీటిని అవసరమైన సమయంలో పంటలకు అందించడంలో అధికారులు విఫలమవుతున్నారని ఆరోపించారు. రిజర్వాయర్ నీటితో చెరువులను నింపి పంట పొలాలకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. రైతులను ఆదుకోకపోతే వారిని ఏకం చేసి జిల్లా కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు శెట్టిపల్లి సత్తిరెడ్డి, మండల కార్యదర్శి తాడూరి రవీందర్, జిల్లా కమిటీ సభ్యురాలు అత్తిని శారద, మండల నాయకులు తేలు ఇస్తారీ, తాడూరి మల్లేశం, సార్ల యాదయ్య, ఆరుట్ల రవి, నీల బిక్షపతి పుట్ట అంజయ్య ఏనుగుల శ్రీను తదితరులు పాల్గొన్నారు

## సెప్టెంబరు 1న మహాధర్నాను విజయవంతం చేయాలి

**పీఆర్టీయూటీఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమం**




**హుస్నాబాద్, ఆగస్టు 14 (తెలంగాణ వాణి ఆర్‌సి):**
ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని పీఆర్టీయూటీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి శశిధర్ శర్మ డిమాండ్ చేశారు. అక్కన్నపేట మండలం కేశవాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2026 సంవత్సరానికి పీఆర్టీయూటీఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మండల అధ్యక్షుడు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా శశిధర్ శర్మ మాట్లాడుతూ ఉపాధ్యాయులకు సంబంధించిన పీఆర్సీ బకాయిలు, పెండింగ్ డీఏలను వెంటనే విడుదల చేయాలని కోరారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం పీఆర్టీయూటీఎస్ నిరంతరం పోరాడుతుందని తెలిపారు. సెప్టెంబరు 1న పీఆర్టీయూటీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న మహాధర్నాకు ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కేశవాపూర్ పాఠశాల ఉపాధ్యాయులు మహాధర్నాకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో పి ఆర్ టి యు టి ఎస్ జిల్లా సీనియర్ నాయకులు సంపత్‌రావు, సర్దార్, కిషన్ నాయక్, బాల్‌రెడ్డి, మల్లేశం,పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యకు దూరమైన వారికి ఓపెన్ స్కూల్ మంచి అవకాశం

### ఓపెన్ టెన్త్,ఇంటర్‌లో ప్రవేశాలు సద్వినియోగం చేసుకోవాలి

### కలెక్టర్ చిత్రా మిశ్రా



**కరీంనగర్:ఆగస్టు 14 (తెలంగాణ వాణి)**
విద్యకు దూరమైన విద్యార్థినీ, విద్యార్థులు తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవా లని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా సూచించారు. తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ అడ్మిషన్ డ్రైవ్‌లో భాగంగా శుక్రవారం రాత్రి కలెక్టర్ తన చాంబర్‌లో పోస్టర్,బుక్‌లెట్‌ను ఆవిష్క రించారు.
ఈ సందర్భంగా కలెక్టర్ చిత్రా మిశ్రా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో వివిధ కారణాలతో పాఠశాల విద్యకు దూరమైన విద్యార్థు లు ఓపెన్ స్కూల్ విధానం ద్వారా తిరిగి విద్యను కొనసాగించే అవకాశాన్ని వినియోగించుకోవాలని అన్నారు.ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో ప్రవేశాలు పొందేందుకు దరఖాస్తు చేసుకుని తమ విద్యాభ్యా సాన్ని కొనసాగించాలని సూచించారు.విద్యను మధ్యలో నిలిపివేసిన వారు తిరిగి చదువుకోవడానికి తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ మంచి వేదికగా నిలుస్తుందని కలెక్టర్ పేర్కొ న్నారు.ఓపెన్ స్కూల్ ద్వారా విద్యను కొనసాగిం చి ఉన్నత విద్యకు పునాది వేసుకోవాలని,నిర్దేశించుకు న్న లక్ష్యాలను సాధించేం దుకు కృషి చేయాలని విద్యార్థులకు సూచించారు. విద్యాభ్యాసానికి వయస్సు, పరిస్థితులు అడ్డంకులు కాకూడదని,అందుబాటు లో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని ప్రతి ఒక్కరూ తమ విద్యా లక్ష్యాలను చేరుకోవాలని ఆమె ఆకాంక్షించారు. ఓపెన్ టెన్త్,ఇంటర్ ప్రవేశాలపై గ్రామీణ ప్రాంతాల్లో మరింత విస్తృతంగా అవగాహన కల్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖ అధికారి చైతన్య జైనీ, ఉమ్మడి జిల్లా టీఓఎస్ఎస్ కోఆర్డినేటర్ రామడుగు రవీందర్,డీసీఈబీ సెక్రటరీ భగవంతయ్య, కోఆర్డినేటర్ అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




# బాక్సాఫీస్ వద్ద బిగ్ ఫైట్

**ఇండిపెండెన్స్ డే కానుకగా ఒకే రోజు థియేటర్లలోకి ఏడు చిత్రాలు!**

ఇండిపెండెన్స్ డే లాంగ్ వీకెండ్ సెంటిమెంట్‌ను క్యాష్ చేసుకునేందుకు టాలీవుడ్‌లో ఎన్నడూ లేని విధంగా భారీ పోటీ నెలకొంది. బాక్సాఫీస్ రేసులో నిలిచేందుకు పెద్ద సినిమాల నుంచి చిన్న చిత్రాల వరకు ఏకంగా 7 సినిమాలు ఒకే రోజు ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాయి. ఒకే తేదీని టార్గెట్ చేస్తూ ఇన్ని సినిమాలు బరిలోకి దిగుతుండటంతో థియేటర్ల కేటాయింపు, అడ్వాన్స్ బుకింగ్స్ మరియు కలెక్షన్ల పరంగా తీవ్రమైన పోటీ తలెత్తింది. ఇక ఇందులో తెలుగులోనే 5 సినిమాలు రాబోతుండగా హిందీ నుంచి రెండు సినిమాలు విడుదల కాబోతున్నాయి.

**విశ్వనాథ్ అండ్ సన్స్ :** తమిళ స్టార్ హీరో సూర్య ప్రధాన పాత్రలో, సక్సెస్‌ఫుల్ డైరెక్టర్ వెంకీ అట్లూరి దర్శకత్వంలో తెరకెక్కిన తాజా చిత్రం విశ్వనాథ్ అండ్ సన్స్. రొమాంటిక్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రాబోతున్న ఈ సినిమాలో మమిత బైజు కథనాయికగా నటిస్తుండగా రాధిక శరత్ కుమార్ కీలక పాత్రలో కనిపించబోతుంది. ఈ చిత్రంపై అటు తమిళంతో పాటు ఇటు తెలుగులో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇటీవలే కరుప్పు సినిమాతో బ్లాక్ బస్టర్ అందుకున్న సూర్య ఈ సినిమాతో మరో హిట్టు కొడతాడని అభిమానులు అంచనాలు వేస్తున్నారు.

**అగధ :** టాలీవుడ్ ప్రముఖ నిర్మాత, దర్శకుడు ఎం.ఎస్. రాజు దర్శకత్వంలో రాబోతున్న చిత్రం ఇది. మిస్టిక్ హారర్, సస్పెన్స్ థ్రిల్లర్ అంటూ రాబోతున్న ఈ చిత్రంలో కామాక్షి భాస్కర్ల ప్రధాన పాత్రలో నటిస్తుంది. ఈ సినిమాపై కూడా టాలీవుడ్‌లో భారీ అంచనాలు నెలకొన్నాయి.

**మకుటం :** కోలీవుడ్ స్టార్ హీరో విశాల్ తొలిసారిగా మెగాఫోన్ పట్టి తెరకెక్కిస్తున్న అత్యంత ప్రతిష్టాత్మక చిత్రం 'మకుటం'. ప్రముఖ నిర్మాణ సంస్థ సూపర్‌గుడ్ ఫిల్మ్స్ బ్యానర్‌పై 99వ ప్రాజెక్ట్‌గా ఇది వస్తోంది. ఇందులో విశాల్ భిన్నమైన మూడు పాత్రల్లో విశ్వరూపం చూపించనున్నారు. విశాల్, అంజలి కాంబినేషన్‌కు ఉండే క్రేజ్ ఈ సినిమాపై అంచనాలను తారాస్థాయికి చేర్చింది. జి.వి. ప్రకాష్ కుమార్ అందించిన సంగీతం ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనుంది.

**పల్లాబురుసు :** గ్రామీణ తెలంగాణ నేపథ్యంలో సాగే ఒక సరికొత్త ఫ్యామిలీ కామెడీ–డ్రామా చిత్రం ఇది. సాధారణమైన ఒక వృద్ధ తండ్రి తన కొడుకుపై పోలీస్ స్టేషన్‌లో చిన్న కారణం (టూత్‌బ్రష్ కొనివ్వలేదని) నిమిత్తం కంప్లైంట్ ఇవ్వడం వంటి విభిన్నమైన పాయింట్‌తో ఈ కథ నడుస్తుంది. తండ్రీకొడుకుల మధ్య ఉండే సున్నితమైన భావోద్వేగాలు, అహం, మారుతున్న సామాజిక విలువలను కళ్లకు కట్టేలా ఈ చిత్రాన్ని దర్శకుడు ఎమోషనల్ అండ్ ఎంటర్‌టైనింగ్ వేలో తెరకెక్కించారు. సుధాకర్ రెడ్డి, మురళీధర్ గౌడ్, ప్రజ్వల్ యాద్మ కీలక పాత్రల్లో నటించిన ఈ సినిమాకు ఉదయ్ చౌహాన్ దర్శకత్వం వహించాడు. అన్నపూర్ణ స్టూడియోస్ ఄ ఎపిక్ స్టూడియోస్ నిర్మించాయి.

హుషార్ పిట్టలు : వాసవి గణేషన్, అన్ష్, సునితా మనోహర్, అంజి వల్లుమన్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సినిమాకు భిక్షు దర్శకత్వం వహించాడు. పూర్తిగా యూత్‌ఫుల్, లవ్ మరియు ఫ్రెండ్‌షిప్ ఎంటర్‌టైనర్ జోనర్‌లో రూపొందిన చిత్రం ఇది. నేటి యువత ఆలోచనలు, వారి జీవితంలోని సరదా క్షణాలు, ప్రేమ మరియు అనుబంధాల చుట్టూ ఈ కథ తిరుగుతుంది. బాక్సాఫీస్ వద్ద కాలేజ్ గోయర్స్ మరియు యూత్ ఆడియన్స్‌ను టార్గెట్ చేస్తూ ఈ సినిమా రూపొందింది.

**ఆవారాపన్ 2 :** ఇమ్రాన్ హష్మీ, దిశా పటాని, షబానా ఆజ్మీ తదితరులు కీలక పాత్రల్లో నటించారు. సంచలన విజయం సాధించిన 'ఆవారాపన్' చిత్రానికి సీక్వెల్‌గా వస్తున్న క్రేజీ యాక్షన్ ఎమోషనల్ డ్రామా ఇది. 'శివమ్' పాత్ర మరోసారి క్రైమ్ ప్రపంచంలోకి అడుగుపెట్టి, ప్రేమ, ప్రతీకారం, త్యాగం మరియు విముక్తి కోసం సాగించే అన్?షణ దీని ప్రధాన కథాంశం.






# మహాదేవిగా మారడానికి చాలా కష్టపడ్డాను

'ఇందులో నా పాత్ర పేరు మహాదేవి. దేవుని అనుగ్రహంతో పుట్టే పాత్ర అది. నా ప్రిన్సిపల్స్ పక్కన పెట్టి మహాదేవిగా మారడానికి చాలా కష్టపడ్డాను. బుద్ధిజం పుస్తకాల్ని చదివాను' అన్నారు నటి కామాక్షి భాస్కర్ల. ఆమె ప్రధానపాత్ర పోషించిన చిత్రం 'అగధ'. శ్రవణ్‌రెడ్డి, ఉల్కా గుప్తా, జోవికా విజయ్‌కుమార్ కీలక పాత్రధారులు. ఎమ్మెస్ రాజు దర్శకుడు. ఈ నెల 14న విడుదల కానున్నది. గురువారం హైదరాబాద్‌లో కామాక్షి భాస్కర్ల విలేకరులతో ముచ్చటించింది. 'ఎమ్మెస్ రాజుగారి సినిమా అనగానే కథ కూడా వినకుండా ఓకే చెప్పాను. కానీ ఎమ్మెస్ రాజుగారు కూర్చోబట్టి కథ చెప్పి, నాపాత్రను వివరించారు. నిజంగా కథ, నా పాత్ర మనస్ఫూర్తిగా నచ్చాయి. ఇది కేవలం హారర్ థ్రిల్లర్ మాత్రమే కాదు. డివైన్ మూమెంట్స్ కూడా ఇందులో బలంగా ఉంటాయి. టెక్నికల్‌గా కూడా సినిమా అద్భుతంగా ఉంటుంది' అని తెలిపింది కామాక్షి భాస్కర్ల.

# యువతలో మార్పు తెస్తుంది

అన్ష్, వాసవి గణేషన్ జంటగా నటించిన యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ 'హుషార్ పిట్టలు'. బిక్షు దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని రుద్రకాంతి పిక్చర్స్ పతాకంపై వెంకట్ యాదవ్ నిర్మించారు. ఈ నెల 15న ప్రేక్షకుల ముందుకురానుంది. గురువారం ప్రీరిలీజ్ వేడుకను నిర్వహించారు. నిర్మాత వెంకట్ యాదవ్ మాట్లాడుతూ 'ప్రచార చిత్రాలకు అద్భుతమైన స్పందన లభించింది ప్రీమియర్‌షోస్‌కి కూడా మంచి రెస్పాన్స్ వస్తున్నది. వినోదంతో పాటు హృదయాన్ని కదిలించే భావోద్వేగాలున్న కథ ఇది. చరణ్ అర్జున్ మ్యూజిక్ ప్రత్యేకాకర్షణగా నిలుస్తుంది' అన్నారు. నేటి యువతకు చక్కటి



సందేశాన్ని అందించే చిత్రమిదని, హిట్ పక్కా అని హీరో అన్ష్ నమ్మకం వ్యక్తం చేశారు. ఒక జనరేషన్‌లో మార్పుతెచ్చే సినిమా ఇదని కథానాయిక వాసని గణేషన్ చెప్పింది. ఈ చిత్రానికి కెమెరా: రుద్రసాయి, సంగీతం: చరణ్‌అర్జున్, దర్శకత్వం: బిక్షు.

# విషపూరిత బంధాన్ని తెంచుకున్నా

వ్యక్తిగత విషయాలను ఎక్కువశాతం చాలామంది గోప్యంగానే ఉంచుతారు. బహిర్గతం చేసుకోరు. కానీ అందుకు భిన్నమైన వ్యక్తిత్వం నటి అనుపమ పరమేశ్వరన్‌ది. తన అనుభవాలు ఇతరులకు హెచ్చరికలా ఉండాలనే ఉద్దేశ్యంతో ఇటీవల ఓ ఇంటర్వ్యూలో నిర్మొహమాటంగా మనసును ఆవిష్కరించారామె. 'ప్రేమ పేరుతో ఓ వ్యక్తి కొన్నేళ్ల క్రితం నా జీవితంలోకి వచ్చాడు. పరిచయమైన మూడు నెలలకే నిశ్చితార్థం, వివాహం అంటూ బలవంతపెట్టడం మొదలుపెట్టాడు. ఆ తొందరపాటులో ప్రేమకంటే నన్ను నియంత్రించాలనే ఆత్రమే ఎక్కువ కనిపించేది. నేను ధరించే దుస్తులు, సోషల్ మీడియాలో నేను పెట్టే పోస్టులు, చివరికి నేను ఎంచుకునే సినిమాల విషయంలో కూడా ఆంక్షలు విధించడం మొదలుపెట్టాడు. అసలు నటనకే నన్ను దూరం చేయాలని చూశాడు. దాంతో స్వేచ్ఛకు దూరమై మానసికంగా నలిగిపోయాను. కేరవాన్‌లో ఒంటరిగా కూర్చొని ఏడ్చేదాన్ని. ఒక్కోసారి అతని ప్రవర్తన భయం కలిగించేది. ఈ ఆందోళన వల్ల బరువు తగ్గిపోయాను. నా కెరీర్‌లోనే అతి పెద్ద విజయమైన 'డ్రాగన్' సినిమా ప్రమోషన్స్‌కి నేను హాజరు కాకపోవడానికి కారణం కూడా అతనే. అందుకే ఆ విషపూరిత బంధాన్ని అతికష్టం మీద తెంచుకున్నా. ప్రస్తుతం ఆ మానసిక గాయం నుంచి కోలుకునే పనిలో ఉన్నా' అంటూ ఆవేదన వ్యక్తం చేసింది అనుపమ. అయితే



ఆ వ్యక్తి ఎవరో మాత్రం ఆమె వెల్లడించలేదు. అగ్రహీరో విక్రమ్ తనయుడు ధృవ్‌తో ఆమె కొన్నాళ్లుగా ప్రేమలో ఉన్నట్టు వార్తలొచ్చిన విషయం తెలిసిందే. ఈ ఇంటర్వ్యూలో అనుపమ వ్యాఖ్యలు ప్రస్తుతం వైరల్‌గా మారాయి.

Printed, Published & Owned by JERIPOTHULA SAMPATH, Printed at SRI BALAJI, H.No. 4-4-85, Tilak road, District Karimnagar. 505 001 (T.S) Published at H.No. 3-6-307, Subhash Nagar, Karimnagar MDI: District, Karimnagar -505 001 (T.S) Editor: JERIPOTHULA SAMPATH, RNI NO. APTEL/2012/53127 CELL:9912758107, telanganavanil@gmail.com